ఎంతో అభివృద్ధి చేశాను



16లో

మాజీ సీఎం కేసీఆర్‌తో నే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు : మాజీ మంత్రి జీవన్ రెడ్డి



కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 01, సెప్టెంబర్ 2026 16 పేజీలు



ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

వారికి.. వారి కుటుంబాలకు సమాజంలో అత్యంత గౌరవం దక్కాలి

అధికారులతో సమీక్షలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

2లో

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వికలాంగుల, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో, గౌరవప్రదమైన జీవితం గడిపేలా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వారికి మాత్రమే కాకుండా వారి కుటుంబాలకు కూడా సమాజంలో అత్యంత గౌరవం లభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు.

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి

పెద్దపీట..!



పంటల లెక్కకు ప్రత్యేక

యాప్



2లో

యాప్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

పంటల వివరాలన్నీ నమోదుకు చర్యలు

కార్యచరణ రూపొందిస్తున్న అధికారులు

వాలంటీర్లతో సర్వే ... వాలంటీర్ల శిక్షణ



జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో కూడా వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుడుతుంది. ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే యూరియా వంటి ఎరువులను పొందేందుకు ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టారు. పత్తి పంట మార్కెట్లో అమ్మాలంటే ముందుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ లో వివరాలను నమోదు చేసుకోవాలి. వ్యవసాయ రంగంలో కూడా డిజిటలైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రైతులకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ తప్పదం లేదు. యాప్ లో వివరాలను నమోదు చేసుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే పండించిన పంటలను లెక్కించేందుకు వివరాలను నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వము డిజిటల్ యాప్ ను రూపొందించింది.

2లో

ప్రజాప్రతినిధులకు

అమినిటీస్ భరోసా!



2లో

సభ్యులకు మెరుగైన వసతులు..

ఆధునిక సౌకర్యాలపై కసరత్తు

అమినిటీస్ కమిటీ ప్రథమ సమావేశంలో కీలక చర్చలు

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: శాసనసభ, శాసనమండలి సభ్యులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు తెలంగాణ అమినిటీస్ కమిటీ కసరత్తు ప్రారంభించింది. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల సమస్యల పై సమర్థవంతంగా పనిచేసేందుకు శాసనసభ, మండలి ప్రాంగణాల్లో అవసరమైన మోలిక, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావ డంపై కమిటీ దృష్టిసారించింది. 2026-27 సంవత్సరానికి సంబంధించిన అమినిటీస్ కమిటీ ప్రథమ సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ శాసన మండలిలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

ప్రజాప్రతినిధులకు అమినిటీస్ భరోసా!

సభ్యులకు మెరుగైన వసతులు..
ఆధునిక సౌకర్యాలపై కసరత్తు
అమినిటీస్ కమిటీ ప్రథమ సమావేశంలో కీలక చర్చలు

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: శాసనసభ, శాసనమండలి సభ్యులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు తెలంగాణ అమినిటీస్ కమిటీ కసరత్తు ప్రారంభించింది. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల సమస్యల పై సమర్థవంతంగా పనిచేసేందుకు శాసనసభ, మండలి ప్రాంగణాల్లో అవసరమైన మౌలిక, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావ డంపై కమిటీ దృష్టిసారించింది. 2026-27 సంవత్సరానికి సంబంధించిన అమినిటీస్ కమిటీ ప్రథమ సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ శాసన మండలిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఉపసభాపతి బండ ప్రకాశ్ ప్రత్యేకంగా హాజరయ్యారు. కమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ ఎల్. రమణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

వసతులపై విస్తృత చర్చ

సనసభ, శాసనమండలి సభ్యులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులు, మౌలిక సదుపాయాలను సమీక్షించారు. సభ్యుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా కొత్త సంవత్సరానికి అవసరమైన ఏర్పాట్లు, సభ్యులకు అందించాల్సిన సదుపాయాలు, ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు.

ఆధునిక సదుపాయాలే లక్ష్యం

ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను శాసనసభ, మండలిలో ప్రస్తావిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేం



దుకు అనువైన వాతావరణం అవసరమని సభ్యులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా శాసనసభ భవనంలో ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సభ్యుల కార్యాలయాలు, సమావేశ ప్రదేశాలు, విశ్రాంతి గదులు తదితర ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలను గుర్తించి మెరుగుపరచాలని అభిప్రాయపడ్డారు. సాంకేతికతకు అనుగుణంగా వసతులను అభివృద్ధి చేయడంతో పాటు సభ్యుల విధుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

సభ్యుల సూచనలకు ప్రాధాన్యం

అమినిటీస్ కమిటీ సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ పలు సూచనలు చేశారు. శాసనసభ, మండలి ప్రాంగణంలో ప్రజాప్రతినిధులకు అందుతున్న సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరాన్ని వివరించారు. నియోజకవర్గాల నుంచి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించే క్రమంలో ప్రజాప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు అందుబ ాటులో ఉండేలా చూడాలని కోరారు.సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన వసతుల అభివృద్ధి, ఆధునికీకరణ పనులపై కార్యాచరణ రూపొందించనున్నట్లు సమాచారం.

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల
సంక్షేమానికి పెద్దపీట

ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి
వారికి.. వారి కుటుంబాలకు సమాజంలో అత్యంత గౌరవం దక్కాలి
అధికారులతో సమీక్షలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వికలాంగుల, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో, గౌరవప్రదమైన జీవితం గడిపేలా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వారికి మాత్రమే కాకుండా వారి కుటుంబాలకు కూడా సమాజంలో అత్యంత గౌరవం లభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.

వసతి గృహాల్లో సౌకర్యాలపై దృష్టి

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. వసతి గృహాల్లో వారికి నాణ్యమైన ఆహారం అందించాలని, సురక్షితమైన మంచినీటి వసతి కల్పించాలని సూచించారు. మెరుగైన వసతి, విద్యా సౌకర్యాలతో పాటు పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో ఉంటున్న వారికి అవసరమైన సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వారి దైనందిన అవసరాలకు అనుగుణంగా వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అక్కడ నివసించే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

దివ్యాంగ పిల్లలు, విద్యార్థుల సంరక్షణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. వారి విద్యాభ్యాసానికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు ఆరోగ్యం, భద్రత, పోషకాహారం విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.దివ్యాంగ చిన్నారులకు విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి అందించడం ప్రభుత్వ బాధ్యతగా అధికారులు గుర్తించాలని మంత్రి సూచించారు. వారి సంరక్షణలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా చోటుచేసుకోకుండా పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

ఆత్మగౌరవానికి భరోసా

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. కేవలం సంక్షేమ పథకాలను అమలు చేయడం మాత్రమే కాకుండా.. వాటి ద్వారా లబ్ధిదారులకు భరోసా, గౌరవం కలిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు.వారి సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిశీలించాలని, పరిష్కరించగల అంశాలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ సమస్యల కోసం ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

పథకాల అమలులో లోటుపాట్లు వద్దు

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులకు చేరే విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. లబ్ధిదారుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.సంక్షేమ శాఖ పరిధిలోని కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతతో పరిగణించి పరిష్కరించేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.వారికి, వారి కుటుంబాలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసంతో కూడిన జీవనానికి అవసరమైన సహకారం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరేలా అధికారులు పనిచేయాలని సూచించారు.





పంటల లెక్కకు ప్రత్యేక యాప్

యాప్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
పంటల వివరాలన్నీ నమోదుకు చర్యలు
కార్యచరణ రూపొందిస్తున్న అధికారులు
తొలగనున్న సమస్యలు
వాలంటీర్లతో సర్వే ... వాలంటీర్ల శిక్షణ

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో కూడా వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుడుతుంది. ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే యూరియా వంటి ఎరువులను పొందేందుకు ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టారు. పత్తి పంట మార్కెట్లో అమ్మాలంటే ముందుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ లో వివరాలను నమోదు చేసుకోవాలి. వ్యవసాయ రంగంలో కూడా డిజిటలైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రైతులకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ తప్పడం లేదు. యాప్ లో వివరాలను నమోదు చేసుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే పండించిన పంటలను లెక్కించేందుకు వివరాలను నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వము డిజిటల్ యాప్ ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా పూర్తిస్థాయిలో ఎన్ని ఎకరాలలో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవచ్చు. వాలంటీర్లను నియమించి వారి సహాయంతో డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టనున్నారు. ఇంతకుముందు కూడా రైతులు సాగుచేసిన పంటల లెక్క ఆధారంగానే ప్రభుత్వము ఎరువులు కేటాయించింది. కొనుగోళ్ల ప్రక్రియ కూడా చేసింది. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి సంవత్సరం పంటల సాగు విస్తీర్ణం వివరాలను సేకరిస్తున్నారు. ఈ లెక్కల్లో స్పష్టత లేదనే ఉద్దేశంతో కొంతమేరకు తేడాలు ఉన్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు డిజిటల్ యాప్ ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. గ్రామస్థాయి నుంచి మండలం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు స్పష్టమైన లెక్కలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాఫ్ సర్వే యాప్ ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా ఈ యాప్ ద్వారా ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు స్థలం ఎక్కడ ఉంది అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. సాగుచేసిన ఎకరాలతో పాటు రైతుల సంఖ్యకు సంబంధించి స్పష్టత వస్తుంది. ఈ లెక్కల ప్రకారం పంటలు ఎంత దిగుబడి వస్తాయో కూడా తెలుసుకోవచ్చు. వరి, పత్తి, కంది, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల దిగుబడిని తెలుసుకోవచ్చు. అంతేకాకుండా ఈ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రానికి ఏ మేరకు ఎరువులను కేటాయించాలి అర్థమవుతుంది. ఏ రకమైన పంటకు ఎరువులు ఎంత అవసరమో తెలుసుకోవచ్చు. ఇంతకుముందు ఎరువుల కొరకు ఏర్పడి రైతులు గంటల తరబడి పొద్దస్తమానం క్యూలో నిలబడి ఒకటి రెండు ఎరువుల కష్టాలను తీసుకుని ఇంటి ముఖం పట్టేవారు. ఈ యాప్ ద్వారా సమస్యలన్నీ తొలగిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ యాప్ ప్రవేశపెట్టింది. పంటల లెక్కలను పక్కాగా లెక్కించి యాప్లో నమోదు చేయవచ్చు. ధాన్యము ఎంత దిగుబడి వస్తుందో కూడా తేలిపోతుంది. రైతు భరోసా నిధులు కూడా ఎన్ని ఎకరాలకు ఇవ్వాలో ఈ యాప్ ద్వారా స్పష్టత వస్తుంది. వాస్తవమైన రైతులకు రైతు భరోసా లభిస్తుంది. ఇక డిజిటల్ క్రాప్ సర్వే మరో ఐదు ఆరు రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్వేకు ప్రత్యేకంగా వాలంటీర్లను నియమిస్తున్నారు. వాలంటీర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ యాప్ ద్వారా ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు ఏ రైతు పొలంలో సాగు చేశారు లెక్కలు తెలుస్తాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. పంటల లెక్కింపుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం లెక్కలు ప్రారంభించి వివరాలను యాప్ లో నమోదు చేయనున్నారు.

క్షుద్ర పూజలు, మంత్రాల పేరుతో ..62 లక్షల మోసం

ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్‌రూ.30.50 లక్షల నగదు, పూజా సామాగ్రి స్వాధీనం
వివరాలను వెల్లడించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితె
సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త



దీర్ఘకాలిక అనారోగ్యాన్ని క్షుద్ర పూజలతో నయం చేస్తామంటూ నమ్మించి, ఓ మహిళ వద్ద నుంచి రూ.62 లక్షలకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడిన ఇద్దరు నిందితులను రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మీడియాకు సోమవారం వెల్లడించారు.తురుపాటి శ్యాం కుమార్ (57), తండ్రి: తూముకుంట, హైదరాబాద్ (స్వంత ఊరు: మంకమ్మతోట, కరీంనగర్). పత్తెం లక్ష్మీరాజం (60), అగ్రహారం, వేములవాడ అర్బన్ మండలం.



మొనంసాగిందిలా...హైదరాబాద్‌లోని తూముకుంటలో ఖిభద్రకాళి పూజా స్టోర్‌ఖి నడుపుతున్న శ్యాం కుమార్, తన వద్దకు పూజా సామాగ్రి కోసం వచ్చే వేములవాడ మండలం అగ్రహారంకు చెందిన లక్ష్మీరాజంతో కలిసి అమాయకులను మోసం చేసేందుకు పథకం వేశాడు. ఈ క్రమంలో, పూజా సామాగ్రి కోసం తన షాపునకు వచ్చిన హైదరాబాద్ (ఉప్పల్)కు చెందిన బండారి లత అనే మహిళతో శ్యాం కుమార్ పరిచయం పెంచుకున్నాడు. తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని ఆమె చెప్పడంతో, క్షుద్ర పూజలతో నయం చేయవచ్చని నమ్మించి, అగ్రహారం కు చెందిన పూజారి లక్ష్మీరాజం వద్దకు పంపాడు.పూజల పేరుతో బాధితురాలి నుంచి లక్ష్మీరాజం విడతలవారీగా రూ.10 లక్షలు (సిరిసిల్లలో), రూ.21 లక్షలు (యాదగిరిగుట్టలో), రూ.13 లక్షలు (కాశీలో) నేరుగా నగదు రూపంలో తీసుకున్నారు. అంతేకాకుండా శ్యాం కుమార్ బ్యాంక్ ఖాతాలకు (41666383218) మొత్తం కలిపి సుమారు రూ. 62 లక్షల వరకు జమ చేయించుకున్నారు. బాధితురాలికి ఆరోగ్యం నయం కాకపోవడంతో మోసాన్ని గ్రహించి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీసింది. దీంతో నిందితులు ఆమెతో తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకోవడమే కాకుండా, చేతబడి చేసి కుటుంబం మొత్తాన్ని చంపేస్తామని బెదిరింపులకు దిగారు. చివరకు డబ్బులు ఇస్తామని చెప్పి సిరిసిల్లకు పిలిపించి తప్పించుకోవడంతో, బాధితురాలు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు వేములవాడ మండలంలోని అగ్రహారంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30,50,000 నగదు, 2 సెల్‌ఫోన్లు, క్షుద్ర పూజలకు వాడే బెల్లం బొమ్మలు, పసుపు, కుంకుమలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ గణేష్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి"అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, మంత్రాలు పరిష్కారం కావు. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు వెంటనే అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. గుప్త నిధులు, మంత్రాల పేరుతో మోసగించే వారిని నమ్మవద్దు. ఇలాంటి మూఢనమ్మకాలతో మోసం చేసే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలి."

సఖి కేంద్రంలో వివాహిత ఆత్మహత్యాయత్నం

కౌన్సిలింగ్ జరుగుతుండగానే మాత్రలు మింగిన వైనం
చందుర్తి ఏఈవోగా పనిచేస్తున్న బాధితురాలు
ఏరియా ఆసుపత్రికి తరలింపు పరిస్థితి విషమం
సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని "సఖి కేంద్రంలో సోమవారం ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాల పరిష్కారం కోసం కేంద్రానికి వచ్చి, అక్కడే నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది.స్థానికులు, కేంద్రం నిర్వాహకుల కథనం ప్రకారం.. చందుర్తి మండల వ్యవసాయ శాఖలో కాంట్రాక్ట్ ఏఈవోగా (వ్యవసాయ విస్తరణాధికారి) విధులు నిర్వర్తిస్తున్న నక్క శ్వేతకు, భర్త సంపత్‌తో కొంతకాలంగా కుటుంబ తగాదాలు నడుస్తున్నాయి. ఈ వివాదంపై కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అధికారులు దంపతులిద్దరినీ సిరిసిల్లలోని సఖి కేంద్రానికి పిలిపించారు. అధికారుల సమక్షంలో కౌన్సిలింగ్ జరుగుతుండగా, భర్త సంపత్ సయోధ్యకు నిరాకరించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్వేత.. వెంట తెచ్చుకున్న మాత్రలను ఒక్కసారిగా మింగేసింది.గమనించిన కేంద్రం సిబ్బంది వెంటనే స్పందించి, ఆమెను చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. పెళ్లయిన నాటి నుంచే అదనపు కట్నం కోసం భర్త సంపత్ తన కూతురిని శారీరకంగా, మానసికంగా తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తున్నాడని బాధితురాలి తల్లి కన్నీరుమున్నీరై ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

జిల్లా ఎస్పీ మహేష్ బిగితే
సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

బస్టాండ్ బైకుల పార్కింగ్ అడ్డా

తంగళ్లపల్లి,ప్రభాతవార్త:



స్నేహితుడి జ్ఞాపకాన్ని చిరస్థాయిగా నిలపాలని, ప్రయాణికులకు ఉపయోగపడాలని మంచి మనసుతో కట్టించిన బస్టాండ్ నేడు బైకులకు పార్కింగ్ అడ్డాగా మారింది. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ఉన్న ఈ బస్టాండ్ ను కీ.శే. రెడ్డిమల్ల ప్రదీప్ జ్ఞాపకార్థం తంగళ్లపల్లికి చెందిన వారి స్నేహితులు, ఆత్మీయులు సొంత ఖర్చులతో నిర్మించారు. సిద్దిపేట,హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు,ఉద్యోగులు ఎండలో,వానలో ఇబ్బంది పడకూడదనే గొప్ప ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశారు.ఆ మంచి ఉద్దేశం నీరుగారిపోయింది.ఈ బస్టాండ్ కాస్తా చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చేవారికి బైకులకు అడ్డాగా మారింది.ఉదయం తమ బైకులను బస్టాండ్ లోపల పార్క్ చేసి,బస్సు ఎక్కి సిద్దిపేట హైదరాబాద్ వెళ్తున్నారు.సాయంత్రం వరకు బైకులు బస్టాండ్ లోనే ఉంటున్నాయి.దీంతో అసలైన ప్రయాణికులకు కూర్చునేందుకు చోటే లేకుండా పోయింది.ప్రదీప్ స్నేహితులు ఎంతో అభిమానంతో కట్టించిన బస్టాండ్ లో మనుషులకు బదులుబైకులు దర్శనమివ్వడాన్ని చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. స్థానికుల ఆవేదనస్నేహానికి గుర్తుగా కట్టించిన కట్టడాన్ని ఇలా పార్కింగ్ షెడ్ గా మార్చడం బాధాకరం. ఎవరూ కూర్చోకుండా కేవలం తమ బైకులకు నీడ కోసం వాడుకోవడం ఏంటి అని తంగళ్లపల్లి వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మండల అధికారులు స్పందించి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని స్థానికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు-ఘోరాలు

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

ధర్మపురి, ప్రభాతవార్త.



ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్ కాలనీకి చెందిన పంబాల మహేష్ (30) అనే యువకుడు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహేష్ కొంతకాలం క్రితం ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో అప్పుచేసి ఇల్లు నిర్మించుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ ఏం ఐ లు పెండింగ్ లో పడగా,అప్పు ఇచ్చిన వారి నుండి ఒత్తిడి రావడంతో మనస్థాపానికి గురైనాడు.దాంతో మహేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య.ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన అలెపు రమేష్ కుటుంబ కలహాలతో సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం మాదాపూర్ కు చెందిన ఆలేపు గంగరాజాం పెద్ద కుమారుడు అలెపు రమేష్ (32) కొంతకాలంగా దుబాయ్‌లో ఉంటూ, సుమారు నెల రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చినాడు.గత కొన్ని రోజులుగా రమేష్‌కు తన భార్యతో కుటుంబ విషయాలపై తరచుగా గొడవలు జరుగుతు న్నాయి. ఈ క్రమంలో ఈ నెల 30న రాత్రి రమేష్ మద్యం సేవించి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

తంగళ్లపల్లి మండల కేంద్రంలో దాడి కలకలం

మద్యం మత్తులో వ్యక్తి పై గొడ్డలితో దాడి
తంగళ్లపల్లి, ప్రభాతవార్త



తంగళ్లపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రిజరిగిన దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది.సమాచారం ప్రకారం మామిడాల రాజు అనే వ్యక్తి మద్యం మత్తులో ఉండి, మోతే రాజు అనే మరో వ్యక్తి పై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు.ఈ దాడిలో మోతే రాజుకు తీవ్ర రక్త గాయాల య్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించడంతో, క్షతగాత్రుడిని హుటాహుటిన సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.ఈ దాడికి గల కారణాలు ఏంటి,పాత కక్షలా లేక మద్యం మత్తులో జరిగిన ఘర్షణా అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోరుట్ల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన మెట్పల్లి డిఎస్పి

– వార్షిక తనిఖీ, రికార్డులు, కేసుల దర్యాప్తుపై సమగ్ర పరిశీలన

కోరుట్ల, ప్రభాతవార్త:



కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా మెట్పల్లి డిఎస్పి రాములు సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోని కేసులకు సంబంధించిన ఫైల్స్, వివిధ రకాల రిజిస్టర్లు, రికార్డులు, ఇతర ముఖ్యమైన దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్‌లో పరిశుభ్రత, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం డీఎస్పీ రాములు సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, అప్రమత్తతతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి, చట్టపరంగా వేగవంతమైన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వార్షిక తనిఖీల్లో సీఐ కే. లక్ష్మీనారాయణ, ఎస్సై శ్యామ్ రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆది

మేడిపల్లి, ప్రభాతవార్త :



మండలం లోని కల్వకోట గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజ చేపట్టారు.ఆలయ నిర్మాణానికి అవసరమైన పనులను ప్రారంభించి,అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందాలని ఆయన అన్నారు. అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం భూదాతలు పానుగంటి గంగారం లక్ష్మీనర్సు దంపతులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

భారతీయ జనతా యువ మోర్చా పట్టణ నూతన కమిటీ ఏర్పాటు

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల నియోజక వర్గ నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై. అనూప్ రావు ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన యువ మోర్చా అధ్యక్షులు దమ్మ సంతోష్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ యువ మోర్చా ప్రధాన కార్యదర్శిలుగా దామ శ్రావణ్, తైదల్ ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా వాసం లోకేష్, కొండా నవీన్, కొక్కుల బలరాం, అల్లే రాజేందర్,కోశాధికారిగా మిట్టపల్లి వెంకట సాయి, కార్యదర్శులు పందిల్ల లోకేష్, గుద్దేటి మనోజ్, బొమ్మనవేని శ్రీకాంత్, చిట్యాల శివమణి, గోదా శ్రీకాంత్, సామల్ల సాయిరాం, కార్యవర్గ సభ్యులుగా పుప్పాల అభిరామ్, కోట నందు, నెమురి సాయితేజ, కస్తూరి శశి కుమార్, గంగాదరీ నాగచైతన్య, బైరి రాహుల్, సుతారి వరుణ్ లను లోకిని రాకేష్ నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్, జిల్లా ధార్మిక సెల్ ఎండోమెంట్ కన్వీనర్ మాడవేణి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి లు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గండె నవీన్, ఉపాధ్యక్షులు గోనెల రాజశేఖర్, యేనమనేని రంజిత్ రావు, కార్యదర్శి చిట్యాల రాజేంద్ర కుమార్లు పాల్గొన్నారు.

ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థులకు బస్ సౌకర్యం పై రాస్తారోకో

కోరుట్ల, ప్రభాతవార్త :



ఆదర్శ మోడల్ స్కూల్ కల్లూరు కు వెళ్ళే సుమారు 300 మంది విద్యార్థులకు కేవలం రెండు బస్సులను కేటాయించారు. సోమవారం కేవలం ఒక్క బస్సు మాత్రమే రావడంతో గతంలో కూడా ఈ విషయమై బీజేపీ ఆధ్వర్యంలో మెమొరాండం ఇచ్చినాగానీ ఎటువంటి ఫలితం లేకుండా పోవడంతో విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకొని కల్లూరు రోడ్ సబ్ స్టేషన్ వద్ద విద్యార్థులతో కలిసి బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాకల గణేష్ బైటాయించి రాస్తారోకో చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అనూప్ రావు, కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ సంఘీభావం తెలిపి స్థానిక ఎస్సై శ్యాం రాజ్ సహకారంతో డిపో మేనేజర్ ను పిలిపించి సమస్యపై చర్చించడం జరిగింది. ఎస్సై గారి సమక్షంలో ప్రతి రోజు 3 బస్సులను క్రమం తప్పకుండా నడపాలని డిమాండ్ చేయడంతో తప్పకుండా తగు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ తెలపడంతో రాస్తారోకో విరమించారు. దీనికి సహకరించిన ఎస్సై శ్యామ్ రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

వెంకట్రావుపేటలో పౌర హక్కుల దినోత్సవం

భీమారం, ప్రభాతవార్త:

భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల గిర్దవార్ కిరణ్ కుమార్, ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రకాష్ పాల్గొని పౌర హక్కుల ప్రాధాన్యతను వివరించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. సమాజంలో వివక్షకు తావులేకుండా అందరూ సమానత్వ భావనతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పానుగంటి శ్రీనివాస్, వార్డు సభ్యులు, కుల పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పట్టా భూములకు సరిహద్దులు కేటాయించండి

సర్పంచ్ చెన్నమనేని అజిత్ రావు

భీమారం, ప్రభాతవార్త :

మండలం లోని రాగోజీపేట గ్రామ సర్పంచ్ చెన్నమనేని అజిత్ రావు తమ గ్రామంలోని పట్టా భూములకు సరిహద్దులు కేటాయించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మా గ్రామ ప్రజలకు భూములను పంపిణి చేసి పట్టాలను కూడా అందజేసిందని, అయితే ఎవరికీ ఏ ప్రాంతంలో భూములు ఉన్నాయో వాటికీ సంబందించిన సరిహద్దులను మాత్రం కేటాయించలేదని తెలిపారు. దింతో మా గ్రామంలో సరిహద్దుల విషయంలో ప్రతిరోజూ గ్రామస్తులు గొడవలు పెట్టుకుంటూ పోలిస్టేషన్ ల వెంట వెళ్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. ఈ సమస్య పట్ల తక్షణమే రెవిన్యూ అధికారులు స్పందించి పరిష్కరం చూపలని ఆ ఫిర్యాదులో సర్పంచ్ కోరారు.

కోరుట్ల వార్త



గడి బురుజుల భూమికి కేటాయించిన వీఎల్టి నెంబరును రద్దు చేయాలి

కోరుట్ల, ప్రభాతవార్త:



కోరుట్ల పట్టణంలోని గడి బురుజుల భూమికి కేటాయించిన వీఎల్టి నెంబరును వెంటనే రద్దు చేయాలని ప్రజావాణిలో కోరుట్ల పట్టణ బిఆర్ఎస్ కౌన్సిలర్లు వినతి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణానికి తలమానికంగా ఉన్న గడి బురుజులను కొంతమంది అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా వీఎల్టి నెంబరు వేయించుకుని ఆక్రమించుకునెందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎలాంటి నిర్మాణాలు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగామున్సిపల్ అధికారులు వీఎల్టి నెంబరు కేటాయించారన్నారు.ఈ నెంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఆక్రమించుకునెందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో అన్ని కుల యువజన సంఘాల నేతృత్వంలో ప్రజా ఉద్యమం కోనసాగిస్తామన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీఎల్టినెంబరును రద్దు చేసి ఆ భూమిని కబ్జా కోరుల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పొట్ట సురేందర్, మోసిన్, కొక్కెర మహేష్,జాల వినోద్,గెల్లె గంగాధర్, మిట్టపెల్లి రాజశేఖర్, మ్యాకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు ముద్దు పిఓపి విగ్రహాలు వద్దు

కథలాపూర్(ప్రభాతవార్త)



మట్టి విగ్రహాల వాడకం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని కథలాపూర్ లోని మాస్టో పాఠశాల లో సోమవారం జరిగిన కార్య క్రమం విద్యార్థులు ఉపన్యసించారు, విద్యార్థులు మాట్లాడుతూ మట్టి విగ్రహాలు ముద్దు పిఓపి విగ్రహాలు వద్దు వాటి లోని రసాయనాల వల్ల నీటి కాలుష్యం అవుతుందని, జలక్షరాలకు పర్యావరణానికి హాని కలుగుతుందని, మాస్టో పాఠశాల విద్యార్థుల సలహా ఒకటి అమలు చేయాలని మట్టి విగ్రహం పెట్టిన వారికే చెందాలు రాస్తామని చెప్పాలని ఇదే సంకల్పంతో ముందుకు పోవాలని అన్నారు, ఇంత చక్కగా సమాజానికి ఉపయోగపడే సలహా ఇచ్చినందుకు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్,ప్రిన్సిపల్ రంజిత్, డైరెక్టర్ రాజేందర్లు అభినందించారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

చందుర్తి ఆగస్టు 31 ప్రభాతవార్త



చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. ప్రజా సమస్యల పరిష్కారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన లేక వేలవేల పోయింది. ఒక్కరు కూడా దరఖాస్తూ సమర్పించలేదని ఎంపీడీవో రాధ తెలిపారు.ఈ కార్య క్రమంలో తాసిల్దార్ భూపతి, మండల విద్యాశాఖ అధికారి వినయ్కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి దుర్గరాజు, ఎ పిఎం కళ్యాణి, ఎపిఒ రాజయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సాయం:

రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే ప్రశంస.!

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, గుట్కా, తంబాకు వంటి ప్రాణాంతక అలవాట్లకు దూరంగా ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ దాతల సహకారంతో సమకూర్చిన రూ.40,000 ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డా. సంజయ్ కుమార్ చేతుల మీదుగా క్యాన్సర్ బాధితుడికి అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూకపల్లికి చెందిన రాజ్‌కుమార్ అనే వ్యక్తి నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ, పీఈటీ స్కాన్ తదితర వైద్య పరీక్షల ఖర్చులకు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గుర్తించిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ చొరవ తీసుకున్నారని తెలిపారు. దాతల సహకారంతో పాటు తను కొంత మొత్తం కలిపి రూ.40,000 జమ చేసి, తన చేతుల మీదుగా బాధితుడికి ఇప్పించడం చాలా అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. వైద్యం ఎంతో ఖరీదైనదవుతున్న ఈ రోజుల్లో, గుట్కా, తంబాకు నమలడం వల్లనే నోటి క్యాన్సర్లు విపరీతంగా పెరుగుతున్నాయని ఒక డాక్టర్‌గా ప్రజలను హెచ్చరించారు. ఆపదలో ఉన్న బాధితుడిని ఆదుకునేందుకు ముందుకొచ్చిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ గారికి, సహకరించిన దాతలందరికీ ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుంది

ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్..

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారుజగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల బోనాల జాతర వర్కింగ్ కమిటీ వారి ఆధ్వర్యం లో ఇటీవల నిర్వహించిన బోనాల జాతర 2026 కార్యక్రమం విజయవంతం కాగా జగిత్యాల బి ఎల్ ఎంగార్డెన్స్ లో వారి ఆహ్వానం మేరకు బోనాల జాతర విజయోత్సవ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య సింగర్ మల్లిక్ తేజ,సేవాదళ్ అధ్యక్షులు ముకేష్ ఖన్నా, జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.



వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగలకు పకడ్బందీ ఏర్పాట్లు

పట్టణ అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీరు, ప్రజా సౌకర్యాలకు కౌన్సిల్ ప్రాధాన్యత

మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



వినాయక చవితి ,దసరా పండుగలు పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు జగిత్యాల పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమీండ్ల వాణి శ్రీనివాస్ గారి అధ్యక్షతన ఆగస్టు నెల2026 కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పట్టణ ప్రజలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, విద్యుత్ వెలుగులు, తాగునీరు, పారిశుద్ధం, రహదారుల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగల సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ, పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కౌన్సిల్ కృషి చేస్తుందని పేర్కొన్నారు.సమావేశంలో వినాయక చవితి నిమజ్జనం కోసం పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద తాత్కాలిక విద్యుత్ వెలుగులు, జనరేటర్ల ఏర్పాటు, టవర్ సర్కిల్ వద్ద స్టేజ్, తాగునీటి సరఫరా, ఇతర అవసరమైన ఏర్పాట్లతో పాటు చింతకుంట చెరువు వద్ద క్రేన్లు, ఇసుక బస్తాలు, బారికేడ్లు, తాళ్లు, టార్చిలైట్లు, గ్రీన్ నెట్, గజ ఈతగాళ్లు, నాటు తెప్పలు వంటి భద్రతా ఏర్పాట్లు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.అలాగే నిమజ్జన ప్రాంతంలో చెరువులోని గుర్రపు డెక్క, అవాంఛిత మొక్కలను తొలగించడం, ప్రధాన రహదారులు మరియు సబ్‌లైన్లలో గుంతలను గ్రావెల్, చిప్స్, క్వారీ డస్ట్‌తో పూడ్చడం, విధుల్లో ఉండే పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర సిబ్బందికి తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించడం వంటి పనులకు కూడా ఆమోదం లభించింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎకో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాలను కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేయడానికి కూడా నిర్ణయం తీసుకున్నారు. ఈ పనులకు మొత్తం రూ.33.81 లక్షలు, బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ నిమజ్జన ప్రదేశాల్లో తాత్కాలిక విద్యుత్ వెలుగులు, సీరీస్ బల్బులు, డీజే సౌండ్ సిస్టమ్స్, మహా బతుకమ్మ ఏర్పాటు, నిమజ్జన ఘాట్ల వద్ద గ్రావెల్, డస్ట్ సరఫరా, వివిధ వార్డుల్లో అవసరమైన ఏర్పాట్లు, పారిశుద్ధ్య సిబ్బందికి తాగునీరు, భోజన సదుపాయాలు వంటి పనులకు రూ.37.13 లక్షల, దసరా పండుగ సందర్భంగా జంబిగద్దె, జంబిగద్దె హనుమాన్ ఆలయం వద్ద రంగులు వేయడం, బారికేడింగ్, మైక్ సెట్, డేలైట్స్, సీరీస్ బల్బులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు, టీ.ఆర్. నగర్‌లో స్టేజ్ ఏర్పాటు వంటి పనులకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా జోన్1, జోన్2లో గేట్ వాల్వ్‌లకు అవసరమైన స్పిండిల్/వాల్వ్ రాడ్లు, చెక్‌నట్స్ కొనుగోలు, హౌసింగ్ బోర్డు ఫిల్టర్‌బెడ్స్‌లోని క్లియర్ వాటర్ పంప్‌సెట్లకు సంబంధించిన 250 కే వి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.పట్టణంలోని క్రీడా మైదానాల్లో లాంగ్‌జంప్, హైజంప్ పిట్స్ ఏర్పాటు, తహసీల్ చౌరస్తాలో ఐరన్ చాంబర్ ఏర్పాటు, పూరానీపేటలో గాంధీ విగ్రహం పీఠం అభివృద్ధి, బీట్ బజార్ సమీపంలోని జంబిగద్దె అభివృద్ధి వంటి పలు మౌలిక వసతుల పనులకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా విద్యానగర్ మరియు న్యూ బస్టాండ్ వాటర్ ట్యాంక్ ప్రాంగణాల్లో పారిశుద్ధ్య వాహనాల భద్రత, పర్యవేక్షణ కోసం సి సి టి వి కెమెరాలు ఏర్పాటు, పట్టణ పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేసేందుకు 3 ఈ వి ఆటో టిప్పర్లు, ట్రాక్టర్ విత్ ఫ్రంట్ బ్లేడ్, డంపర్ బిన్లు, 14 ట్రైర్ టిప్పర్ వాహనం కొనుగోలు ఆమోదం తెలిపారు.పలువురు కౌన్సిలర్లు తమ వార్డులకు సంబంధించిన వీధి దీపాలు, పారిశుద్ధం, డ్రైనేజీ, రహదారులు, తాగునీరు తదితర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలనిహా చైర్‌పర్సన్ ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ కె. సత్యప్రణవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డి.ఈ. అరుణ్, అసిస్టెంట్ ఇంజనీర్లు, టి.పి.వో శ్రీనివాస్, జె.ఏ.ఓ. గణేష్‌తో పాటు మున్సిపల్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పై ఎఫ్.ఐ.ఆర్. అన్యాయం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త



ఉత్తరాఖండ్ బిజెపి శ్రేణులు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ జగిత్యాల డిసిసి అధ్యక్షులుగా గాజంగి నందయ్య పేర్కొన్నారు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి. నందయ్య.భారత పార్లమెంట్ లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయటం అన్యాయమని, ఉత్తరాఖండ్ పోలీసులు తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయటాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నల్ల రిబ్బన్ లు కట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హల్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ర్యాలీ ప్రదేశంలో బిజెపి శ్రేణులు కుల వివక్షతో కూడిన శుద్ధికరణ కార్యక్రమాన్ని నిరసిస్తూ, ఆ ఘటనకు బాధ్యులైన వారిపై ఎఫ్. ఐ. ఆర్. నమోదు చేయాలని డిమాండ్ చేసిన లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పై ఉత్తరాఖండ్ పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయటం అన్యాయం అన్నారు. ఈ విషయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిజెపి తమ ప్రతీకార చర్యలను మానుకోవాలన్నారు. దేశ ప్రజలు అంత గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఇంటికి పంపించడం ఖాయమన్నారు. తక్షణమే సంఘటనకు కారకులైన ఉత్తరాఖండ్ బిజెపి శ్రేణులు పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో అంతరించిపోతున్న అంటరానితనాన్ని మతతత్వ శక్తులు మళ్లీ తెరమీదకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కే అంతటి ఘోర పరాభవం జరిగితే సామాన్యుడు పరిస్థితి మతతత్వ శక్తులు పాలనలో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. తక్షణమే ఉత్తరాఖండ్ బిజెపి శ్రేణులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త మోహన్,పిసిసి కార్యదర్శి బండ శంకర్,పిసిసి సేవాదళ్ కార్యదర్శి ముకేశ్ కన్నా,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్, ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు భార్గవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి కూసరి అనిల్, పులి నరసయ్య,ఉపాధ్యక్షులు జల్ల రవి, ఎన్నారై సెల్ కన్వీనర్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రాజేశం గౌడ్ ను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్న మాజీ మంత్రి,రాష్ట్ర తొలి కార్పొరేషన్ చైర్మన్ గోడిసెల రాజేశం గౌడ్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,మాజీ తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ కోలేటి దామోదర్ పరామర్శించారు. గతంలో ఎడమ కాలికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రాజేశం గౌడ్, తాజాగా కుడి కాలికి కూడా శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆసుపత్రికి వెళ్లిన నాయకులు ఆయన ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్యులను సంప్రదించి శస్త్రచికిత్స వివరాలను, చికిత్సకు ఆయన స్పందిస్తున్న తీరును ఆరా తీశారు.రాజేశం గౌడ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని,మళ్లీ ప్రజల మధ్యకు వచ్చి ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్,కోలేటి దామోదర్ ఆకాంక్షిస్తూ భగవంతుడిని ప్రార్థించారు.

మోలిక వసతులు, పారిశుద్ధ్య మెరుదలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తాం

– కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

మెట్‌పల్లి పట్టణంలో మోలిక వసతుల కల్పనకు పారిశుద్ధ్య మెరుగుదల కోసం నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. సోమవారంమెట్‌పల్లి పట్టణంలోని 8వ వార్డులో రూ.2 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ పట్టణంలో మోలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్య మెరుగుదలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. 8వ వార్డు పరిధిలో స్థానికులు ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల సమస్యను నూతన డ్రైనేజీ నిర్మాణంతో శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్, డీఈ నాగేశ్వరరావు, 8వ వార్డు కౌన్సిలర్ ధీవకొండ మానసవిష్ణు, అంగడి పురుషోత్తం, గుడికందుల అజయ్, బత్తుల నరేష్, ఆనంద్, నాయకులు పుదారి సుధాకర్, పెద్ద సలీం, కిషోర్, వేణుగోపాల్, లింగేశ్వర్, మొరపు తేజ, జావిద్, రవి తదితరులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



పచ్చదనంతో హరిత మెట్‌పల్లిగా తీర్చిదిద్దాలి

– మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :

పచ్చదనంతో మెట్ పల్లి పట్టణాన్ని హరిత మెట్‌పల్లిగా తీర్చిదిద్దామని మున్సిపల్ చైర్మన్ మైనార్టీ లింబాద్రి పేర్కొన్నారు. సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నేషనల్ హైవే డివైడర్ల లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణాన్ని పచ్చదనంతో కళకళలాడించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొడ్ల ఆనంద్, నాయకులు కిషోర్, లింగేశ్వర్, డీఈ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలకతీతంగా అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా కృషి

– కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ లింబాద్రి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :



పార్టీలకతీతంగా పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పేర్కొన్నారు సోమవారం మెట్‌పల్లి పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 13 అంశాలను కౌన్సిల్ సభ్యుల ముందుంచగా, వాటికి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పట్టణంలోని పలు మట్టి రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని, వాటిని వెంటనే పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాబోయే వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకుని వినాయక మండపాల వద్ద వర్షపు నీరు నిలవకుండా అవసరమైన చోట మట్టి పోయించాలని సూచించారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని, పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వార్డుల అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీకి మరిన్ని నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, డీఈఈ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకటలక్ష్మి, జేఏఓ రమేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవకు అంకితం కావాలి

– పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు స్వామి యాదవ్

మెట్‌పల్లి రూరల్, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ అనంతరం సమాజ సేవకు అంకిత కావాలని జిల్లా పండిత పరిషత్ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తుమ్మనపెల్లి లక్ష్మీనర్సయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా రిక్గ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, ఇటిక్యాల ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ లు లక్ష్మీనర్సయ్యను సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించి, భగవద్గీతను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..లక్ష్మి నర్సయ్య క్రమశిక్షణ, అంకితభావం, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతమైన దృక్పథంతో పనిచేసి విధి నిర్వహణలో తనదైన ముద్ర వేశారని అన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవకు ముగింపు కాదు. మరో కొత్త సేవా ప్రస్థానానికి శ్రీకారం" అని పేర్కొంటూ, శేష జీవితాన్ని దేశ-ధర్మ పరిరక్షణకు, సమాజ సేవకు, విశిష్టాద్వైత సిద్ధాంత విస్తరణకు వినియోగించాలని అన్నారు. జాతియతే దేశానికి శ్రీరామ రక్ష" అని పేర్కొంటూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, జాతీయ విలువలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం చిట్యాల యుగేందర్, గజెల్లి భూమేశ్వర్, కొరిడె రమేష్ శర్మ, కారపు దేవానంద్, రాంప్రసాద్, యన్. శ్రీనివాస్, యన్. మహేష్, గాజెంగి నాగరాజు, ఆకుల రాజలింగం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి వార్త



ఎమ్మెల్యే సంజయ్ ను కలిసిన నూతన తహసీల్దార్ ముఫ్తార్ పాషా

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:



కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను మెట్‌పల్లి నూతన తహసీల్దార్ ముఫ్తార్ పాషా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మెట్‌పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముఫ్తార్ పాషాకు ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. మెట్‌పల్లి మండలంలో ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నూతన తాసిల్దార్‌కు సూచించారు.

శివన్నామస్మరణతో మారు మ్రోగిన సోమన్న కొండ

మల్లాపూర్ ప్రభాతవార్త:



అత్యంత పురాతన ఆలయంగా ప్రసిద్ధిగాంచి భక్తుల కోరికలను తీర్చే ఇష్ట దైవంగా విరజిల్లుతున్న శ్రీ కనక సోమేశ్వర కొండపై శ్రావణమాస సందడితో శివన్నామస్మరణతో మార్మోగింది. శ్రావణమాసం పురస్కరించుకొని మూడవ సోమవారం రోజున సుదూర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు పిల్లాపాపలతో కాలినడకన కొండ పైకి చేరుకొని పవిత్ర కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. కాగా స్వామివారికి అత్యంత ప్రీతి ప్రాతికమైన వరద పాయసాన్ని నైవేద్యంగా వండుకొని డప్పు చప్పుళ్లతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి పాడి పంటలు సమృద్ధిగా పండాలని పిల్లాపాపలను చల్లంగా చూడాలని మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కొండ కింద దాతల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు.

7వ వార్డులో పాత ఇనుప సామగ్రి తొలగించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :



మెట్‌పల్లి పట్టణంలోని 7వ వార్డులో ఇళ్ల పరిసరాల్లో పేరుకు పోయిన పాత ఇనుప సామగ్రి దుకాణాలను, ఇతర వ్యర్థాలను తొలగించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతూ 7వ వార్డు ప్రజలు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఇళ్ల సమీపంలో పాత ఇనుప సామగ్రిని కుప్పలుగా నిల్వ ఉంచడంతో పందికొక్కులు, దోమలు, ఎలుకలు, పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు సహా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాత సామగ్రి వల్ల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొని దోమలు, ఇతర కీటకాలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాత ఇనుప సామగ్రి దుకాణాలను తొలగించి, పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని కోరారు. వార్డు ప్రజల సమస్యను పరిగణనలోకి తీసుకుని మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని 7వ వార్డు కాలనీ వాసులు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్,ప్రభాతవార్త:

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ) లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో 162 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ సేకరించి అనంతరం సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 04 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 04 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

మండలాల్లో స్వీకరణ:

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి ప్రజల



నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు.. బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 07, చందుర్తి మండలం 0, ఇల్లంతకుంట మండలం 08, గంభీరావుపేట మండలం 10, కోనరావుపేట మండలం 08, ముస్తాబాద్ మండలం 20, రుద్రంగి మండలం 0, తంగళ్లపల్లి మండలం 12, వీర్నపల్లి మండలం 07, వేములవాడ అర్బన్ మండలం 06, వేములవాడ రూరల్ మండలం 04, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 08 చొప్పున వచ్చాయి.ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో నేరాలపై జిల్లా పోలీసుల ఉక్కుపాదం : పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- మహిళలు,యువతులు వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించండి
- ఎస్పీ మహేష్ బి.గితే

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను లైగింక వేధింపులకి గురిచేసిన (పోక్సో) కేసులో నిందుతుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష మరియు 5000 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ సోమవారం రోజున తీర్పు వెల్లడించి నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ బాలికను జనగంకి చెందిన యటెల్లి విజయ్ అనే వ్యక్తి లైగింకా వేధింపులకి గురిచేయాగా బాలిక తల్లి ఫిర్యాదు మెరకు అప్పటి తంగళ్ళపల్లి ఎస్.ఐ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కి తరలించడం జరిగింది.అప్పటి డీఎస్పీ చంద్రశేఖర్ గారు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 18 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి కె.జాన్సీ గారు వాదించగా,శాస్త్రీయ ఆధారాలు,సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన యేటల్లి విజయ్ కు 20 సంవత్సరాలు జైలు శిక్ష , 5000 జరిమాన విధించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వేధింపులు లేదా అన్యాయం ఎదురైతే మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్, ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి, అప్పటి , ప్రస్తుత తంగళ్లపల్లి ఎస్ ఐలు లక్ష్మారెడ్డి ,అశోక్ ,పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ,కోర్టు మానిటర్నింగ్ ఎస్.ఐలు రవీందర్ నాయుడు,శ్రవణ్ యాదవ్,కోర్టు కానిస్టేబుల్ రాజేందర్,సి ఎం ఎస్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల,భరోసా సెంటర్ లీగల్ సపోర్ట్ వర్సన్ లహరిక లను జిల్లా ఎస్పీ అభినందించారు.

భూముల రీసర్వే కచ్చితత్వంతో పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

- రెవెన్యూ,అటవీ,సర్వే శాఖల సమన్వయం తప్పనిసరి.
- గడువులోగా లక్ష్యాలను సాధించాలి.
- ఉన్నతాధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం.

సిరిసిల్ల అర్బన్, ప్రభాతవార్త:

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఆమె రెవెన్యూ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భూముల రీసర్వే, భూభారతి, సాదాబైనామా, ఎస్ఐఆర్,22ఏ తదితర కీలక అంశాలపై మండలాల వారీగా తహసీల్దార్లు, సర్వే అధికారులతో లోతుగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలోనే పక్కా వివరాల సేకరసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయి నుంచి సేకరించే వివరాలే ప్రామాణికమని, అధికారులు నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.



గ్రామాల్లో సర్వే చేపట్టే ముందు సంబంధిత భూముల సర్వే నంబర్ల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. గ్రామ సరిహద్దుల రీసర్వే సమయంలో రెవెన్యూ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్),అటవీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పాల్గొనాలి.గ్రామ సరిహద్దుల రీసర్వేతో పాటు క్షేత్రస్థాయి పనులను సంబంధిత తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలి. భూ భారతి, సాదాబైనామా క్రమబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పకడ్బందీగా అమలు చేయాలి.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీవో కే.ఎస్.బి. కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం

గంభీరావుపేట, ప్రభాతవార్త:

ఎస్సీ వర్గీకరణలో మాలలకు జరిగిన అన్యాయంపై సచివాలయం ముట్టడికి వెళ్లిన వారిని అరెస్టు చేయడం అ ప్రజాస్వామికమని జిల్లా మాలల ఐక్యవేదిక నాయకులు రెడ్డిమల్ల రాజనర్సు ఒక ప్రకటనలో ఆరోపించారు. అసెంబ్లీ ముట్టడికి తరలిన గంభీరావుపేట మండల నాయకులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు.మాల సామాజిక వర్గానికి విద్యా, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని, ముఖ్యంగా రోస్టర్ పాయింట్లను న్యాయబద్ధంగా సవరించాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ముట్టడి తలపెట్టినట్లు తెలిపారు. మాలలకు విద్యా, ఉద్యోగ నియామకాలలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.రాజ్యాంగబద్ధమైన హక్కులకు అనుగుణంగా మాలలకు సరైన ప్రాతినిధ్యం కల్పించి, రోస్టర్ పాయింట్ల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శాంతియుతంగా తమ హక్కులకై సచివాలయం ఎదుట



నిరసన తెలుపడానికి వెళ్లిన నాయకులను పోలీసులు అరెస్టు చేసి గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించడం విచారకరమన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో నాయకులు బండ రమేష్, దోశాల ఉపేంద్ర, నర్మల మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, సుదర్శన్, మల్లారెడ్డిపేట నవీన్, దేవరాజు, సాగర్, అంజి, నరేష్, విష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త

మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం మండల కేంద్రములో సోమవారం జరిగింది.మండల అధ్యక్షులు మారవేణి దివ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల దేవి పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ సిద్ధాంతాలు మరియు అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు తెలిసేలా,ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కుట్రపూరితంగా అడ్డుకున్న విషయాన్ని ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భూమల్ల అనిల్, మహిళా నాయకులు కొలనూరు ముత్తక్క,బెజ్జంకి అక్షత,గజ్జల ఎల్లవ్వ, అల్వాల భారతి,వాడే రేణుక,బర్ల బాబాయ్, పాల్గొన్నారు.

కారు-ఆటో ఢీ.ఒకరికి గాయాలు

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



తంగళ్లపల్లి మండలం నేరెళ్ల హాస్టల్ వద్ద కారు,ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి.గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు ప్రమాదకరంగా మారడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించక ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.రహదారికి ఇరువైపులా ఉన్న ప్రమాదకర చెట్లను వెంటనే తొలగించాలని అధికారులును,హాస్టల్ యాజమాన్యాన్ని గ్రామ ప్రజలు కోరుతున్నారు.ప్రమాదాలు పునరావృతం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గంభీరావుపేట, ప్రభాతవార్త:



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారము నిర్వహించారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రాజబోయిన అర్చన ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలోని పలువురికి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు.కార్యక్రమంలో తహసీల్దారు మారుతిరెడ్డి,ఆర్ఐ సత్యనారాయణ,మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్, జిపిఓ ప్రభాకర్, కార్యదర్శి రుతువా, ఉప సర్పంచ్ సుదర్శన్ లతో పాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు



నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘనంగా సన్మానం

అదనపు ఎస్పీ చేతన్ నితిన్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు చేతన్ నితిన్ ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి



ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు జమీల్ అహ్మద్ (ఎస్ఐ) , సీహెచ్. శ్రీనివాస్, (ఏఎస్ఐ), ఆర్. కృష్ణ కుమార్, (ఏఎస్ఐ), ఏ. శ్రీనివాస్ (హెడ్ కానిస్టేబుల్), పీ. రాజయ్య (హెడ్ కానిస్టేబుల్) లను అదనపు ఎస్పీ శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతా ధికారులు, సహోద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామని అన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది మరియు రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త.

జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. గత శనివారం నుండి ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు నిర్వహిస్తున్నారు. జగిత్యాల్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఖాళీగా ఉన్న 2 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల కోసం ఆన్‌లైన్ ద్వారా రికార్డు స్థాయిలో మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయి. అయితే, సోమవారం నాటికి కేవలం 20 మంది దరఖాస్తుదారులు మాత్రమే కార్యాలయానికి విచ్చేసి తమ ధ్రువపత్రాల పరిశీలనను పూర్తి చేసుకున్నారు. ఇంకా 112 మంది అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉందని ప్రాజెక్టు సీడీపీఓ జయప్రద ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎవరూ ఆందోళన చెందకుండా, మిగిలిన 112 మంది అభ్యర్థులు కూడా త్వరితగతిన తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఐసీడీఎస్ కార్యాలయంలో హాజరై పరిశీలన పూర్తి చేయించుకోవాలని ఆమె స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన తుంగూరి వెంకటేశం

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాష్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



విధి నిర్వహణలో అత్యుత్తమైన సేవలు తుంగూరు వెంకటేశం అందించారని జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడికో సోషల్ వర్కర్ గ్రేడ్ 1 తుంగూరి వెంకటేశం పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలు, పదవి విరమణలు సర్వసాధారణం అన్నారు. ఈ సందర్భంగా తుంగూరి వెంకటేశం విధి నిర్వహణలో సమయపాలన, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసేవారని, ఆయన ఎంతోమందికి ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడి డాక్టర్ రణధీర్, పీడియాట్రిక్ డాక్టర్ కళ్యాణ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సయ్యద్ అబ్దుల్ హుస్సేన్, జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, తుంగూరి సురేష్, సిబ్బంది, బంధువులు, తదితరులు పాల్గొన్నారు

జగిత్యాల వార్త

తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ తేదీ పొడగింపు

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించారు. 14 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరూ పదవ తరగతికి మరియు 15 సంవత్సరాల నిండిన అందరూ ఇంటర్మీడియట్ చేయడానికి అర్హులు కావున ఈ అవకాశాన్ని చదువు మధ్యలో మానేసిన ఉద్యోగం చేసుకునే మహిళలకు ,విద్యార్థులకు సువర్ణ అవకాశం అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ రామడుగు రవీందర్ మరియు జగిత్యాల తపోవన్ హై స్కూల్ ఏఐ కోఆర్డినేటర్ అనుమల్ల శ్యామ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. వివరాలకు 98 49 266 786 ను సంప్రదించగలరు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో జగిత్యాలలో విస్తృత వాహన తనిఖీలు

-16 వాహనాలు సీజ్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల పట్టణ కేంద్రంలోని బస్ డిపో సమీపంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 16 వాహనాలను అధికారులు సీజ్ చేశారు. రోడ్ టాక్స్, వెహికల్ ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ వంటి ప్రాథమిక పత్రాలు సరిగ్గా లేకపోవడంతో ఈ వాహనాలపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి సందాని మహమ్మద్ మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ ప్రయాణించాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిటిఓ సందాని మహమ్మద్‌తో పాటు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రామారావు, సాయి చరణ్, శ్రీనివాస్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త



జగిత్యాల పట్టణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులను సోమవారం బిజెపి నాయకులు, రాష్ట్ర క్రియాశీల సభ్యులు ఇల్లందుల కృష్ణమాచారి, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు ఇల్లెందుల రాజు, హరికృష్ణ, కట్ట విజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు గన్నేరువరం బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి సింహరాశి శ్రీధర్, ఉపాధ్యక్షులు ఇనుగుర్తి సురేష్, కోశాధికారి సింహరాజు అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి కట్ట వినోద్ కుమార్ లను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. స్వర్ణకారుల సంక్షేమానికి, సంఘం బలోపేతానికి నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షి ంచారు. సంఘం ప్రతినిధులు, స్థానిక స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి మాజీ ఎమ్మెల్యే రసమయి క్షమాపణ చెప్పాలి

.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి..

మానకొండూర్, ప్రభాతవార్త:

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని మానకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు సోమవారం మానకొండూరు మండలంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ వారి అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి. డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల మానకొండూరు మండల కేంద్రంలో ఉచిత ఆరోగ్య హెల్త్ క్యాంపు నిర్వహించి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తే వారిపై మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి తక్షణమే అనుచిత వ్యాఖ్యలు వెనుకకు తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మానకొండూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అర్హులైన లబ్ధిదారులకు ఒక్కరికైనా తెల్ల రేషన్ కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికైనా ఇండ్లు మంజూరు చెయ్యలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు లేని



గ్రామాలలో రసమయి బాలకిషన్ ఓట్లు అడుక్కోవాలని సవాల్ విసిరాడు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు విమర్శించడం సరైంది కాదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి వైద్యుల సేవాభావాన్ని అవమానపరుస్తూ అవహేళనగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. బిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో రసమయి ప్రజల సంక్షేమం కోసం ఒక్క ఉచిత హెల్త్ క్యాంపు నైన ఏర్పాటు చేశారా అని సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యం అన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నేతలపై విమర్శిస్తే ఊరుకునేది లేదని రసమయి బాలకిషన్ కు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ల పెళ్లి సంపత్ గౌడ్, సొసైటీ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, నాగిశెట్టి రాజయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మండల నాయకులు రామిడి శ్రీనివాసరెడ్డి, రేవెల్లి రాజలింగం, బుర్ర శ్రీకాంత్, కనకం అశోక్, వరహాల చారి, దూలం దేవేంద్ర స్వామి, ఎనగంటి శ్రీకాంత్, కనకం కుమార్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ఇందిరమ్మ కమిటీ చైర్మన్ గా సర్పంచ్

మానకొండూర్, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేపట్టిన ఇందిరమ్మ పథకంలో గ్రామ సర్పంచ్ ల కు ప్రాధాన్యత ఇవ్వాలని మండల సర్పంచుల ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీ లో గ్రామ సర్పంచ్ ను చైర్మన్ గా నియమించినప్పటికీ ఆ గ్రామాల సర్పంచులకు కమిటీలో విలువలు లేవని ఆరోపించారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా లబ్ధిదారుల ఇంటి వద్దకే ఇంద్రమ్మ కమిటీ మెంబర్స్ వెళ్లి ఫోటో లు తీపిస్తున్నారని, అలాగే ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు కూడా వారే పోస్తున్నారని ఆ గ్రామ సర్పంచులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండానే ఇంద్రమ్మ కమిటీ మెంబర్లు ఇష్ట రాజ్యాంగ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇంద్రమ్మ కమిటీలో ప్రభుత్వ సర్పంచులకు కూడా కమిటీ మెంబర్ లు లెక్కచేయడం లేదన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారికి



నచ్చిన వారికే ఇండ్లు మంజూరు చేస్తూ, అర్హులైన పేదవారికి ఇండ్లు మంజూరు కాకపోతే సర్పంచ్ దే బాధ్యులు అంటూ గ్రామ సర్పంచ్లను బదనం చేస్తున్నారని, గ్రామ సర్పంచ్ గా ఇందిరమ్మ కమిటీ చైర్మన్ గా సంతకాలకు మాత్రమే పనిచేస్తున్నామని ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన గ్రామ ప్రథమ పౌరుడికి ప్రభుత్వ పథకాలలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల పోరం అధ్యక్షుడు పెంచాలా కిషన్ రావు, మండల సర్పంచులు తాళ్లపల్లి వర్షిని శేఖర్ గౌడ్, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, అంబటి స్వామి, శారద శ్రీనివాస్, టి, సంపత్, అనిల్ కుమార్, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

..కరీంనగర్ కలెక్టరేట్ , ప్రభాతవార్త

:ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.మొత్తం 172 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించారు.ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు



త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యేలా ప్రతి శాఖ అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు

ఖైదీలు జిల్లా కారాగారాన్ని ఒక పరివర్తన కేంద్రంగా భావించాలి

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త

:నేర స్వభావాన్ని అలవాటుగా మార్చుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి వై. యశ్వంత్ సింగ్ హితవు పలికారు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై. యశ్వంత్ సింగ్ స్థానిక జిల్లా కారాగారాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలకు అందుతున్న వివిధ వసతులు, సేవలపై ఆయన సమగ్ర తనిఖీ చేపట్టారు.


అనంతరం శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో పాటు విచారణ ఖైదీలతో ఆయన మాట్లాడారు. డబ్బుపై ఉన్న తీవ్ర వ్యామోహంతో గంజాయి సేవించడం, అమ్మడం లేదా కలిగి ఉండటం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన శిక్షలు పడతాయని హెచ్చరించారు. నేర స్వభావాన్ని అలవాటుగా మార్చుకోవద్దని హితవు పలికారు.

ఖైదీలు జిల్లా కారాగారాన్ని ఒక పరివర్తన కేంద్రంగా భావించాలని, జైలులో ఉన్నంత కాలం సత్ప్రవర్తనతో మెలిగి, విడుదలయ్యాక ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. న్యాయసహాయం కావలసిన వారు జైలును సందర్శించే ఉచిత న్యాయవాదులను సంప్రదించి సేవలు పొందవచ్చని తెలిపారు. అలాగే ఖైదీలకు సులభంగా అందుబాటులో ఉండేలా న్యాయ సేవాధికార సంస్థ చరవాణి (మొబైల్) నంబరును అందరికీ కనిపించే ప్రాంతంలో ప్రదర్శించాలని జైలు అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జితో పాటు డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, జైలర్లు లక్ష్మీనారాయణ, అజయ్, డిప్యూటీ జైలర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ వేణు, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్ వార్త



ఆధునిక సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి పట్టు సాధించాలి

కరీంనగర్ క్రైమ్, ప్రభాత వార్త

:తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన సిసిటిఎన్ఎస్2.0, టీఎస్‌కాప్, ఈసాక్ష్య, సిఈఐఆర్ వంటి ఆధునిక సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి పట్టు సాధించాలనిజిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారుకరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలోని వాహనాలు, సిబ్బంది విధులు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్ లో పొందుపరచాలని, పెండింగ్ దర్యాప్తులను వేగవంతం చేసి, సైబర్ నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు.త్రీటౌన్ పరిధిలోని ప్రాంతాలను సెక్టార్లుగా విభజించి విపిఓ లను కేటాయించాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ తక్షణ న్యాయం అందించాలని సూచించారు. ఈ తనిఖీలో త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ తిరుమల్ గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

అల్ఫోర్స్‌లో ఘనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవం

కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త

:వావిలాలపల్లిలోని ఆద్యా క్యాంపస్‌లో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ' విధానాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సమయం ఆదా అవ్వడంతో పాటు పనులు వేగవంతం అవుతాయని, వ్యయం కూడా తగ్గుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఈ సాంకేతికతను ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. పరీక్షల విశ్లేషణ, నిఘా వ్యక్తుల పనితీరును మూల్యాంకనం చేయడానికి ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐఐటీ , నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కీలక సమాచారాన్ని అందిస్తూ ఈ సాంకేతికత ఒక గొప్ప వరంగా మారుతుందని అభివర్ణించారు. సాంకేతికతను సరియైన పద్ధతిలో ఉపయోగించుకుని విద్యార్థులు విజయాన్ని సొంతం చేసుకోవాలని, దేశాభివృద్ధికి భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సాఫ్ట్‌వేర్ ప్రతినిధులు విష్ణు, ముఖేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, సదాచారి, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాన్ని నిబద్ధతతో పూర్తి చేయడం అభినందనీయం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త

:సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని నిబద్ధతతో పూర్తి చేయడం అభినందనీయమని, ఈ ప్రయాణంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని సీపీ కొనియాడారు.కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వన్ టౌన్ ఏఎస్సై ఖాజా ఫయాజుద్దీన్, టౌన్ హెడ్ కానిస్టేబుల్ ఖాజా పాషాలను కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత జీవితంలో ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఇన్స్పెక్టర్లు సృజన్ రెడ్డి, కిరణ్ కుమార్, పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. సతీష్, సెక్రటరీ నరసింహారావు, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ వంచన పై గులాబీ రణనాదం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

వెయ్యి రోజుల వైఫల్యాల పై దండెత్తిన బిఆర్ఎస్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు, 420 ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ భారీ నిరసనలకు సిద్ధమైంది. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజుల పాటు "సమరభేరి" పేరుతో పోరుబాట పట్టినట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం హుజురాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఈ వారం రోజుల కార్యాచరణను వెల్లడించారు.

అడుగడుగునా హామీల ఉల్లంఘన : నిప్పులు చెరిగిన కౌశిక్ రెడ్డి.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికార పీఠం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసపూరిత పాలన కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజలపై మోపిన భారాలను ప్రతి ఇంటికి చేర్చేందుకే ఈ వారం రోజుల సమరభేరి కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. రైతు, మహిళ, యువత, విద్యార్థి, కార్మికుడు, ఉద్యోగి... ఇలా సమాజంలోని ప్రతి వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. ఒకవైపు రైతులు కరెంటు, యూరియా లేక అల్లాడుతుంటే, మరోవైపు మహిళలు నెలకు రూ. 2500 కోసం



ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ వైఫల్యాలను ఎండగట్టేందుకే బిఆర్ఎస్ శ్రేణులు కదనరంగం లోకి దూకుతున్నాయని తెలిపారు.

సెప్టెంబర్ 2, 3 తేదీల్లో : ఈ వారం రోజుల ఆందోళనల్లో భాగంగా సెప్టెంబర్ 2న ఉదయం 10 గంటలకు హుజురాబాద్ చౌరస్తాలో 420 అడుగుల భారీ ప్లెక్సీ ప్రదర్శనతో మెగా ధర్నా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఖిబాకీల కార్డులుఖి పంపిణీ చేసి ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను గుర్తు చేస్తారు. సెప్టెంబర్ 3న వీణవంకలో వ్యవసాయ రంగం నిర్వీర్యం, కరెంటు, యూరియా కొరత, రైతుబీమా అమలుపై రైతుల మహా నిరసన చేపట్టనున్నారు. మహిళలు, నిరుద్యోగుల గళంగా కమలాపూర్, జమ్మికుంట నిరసనలు సెప్టెంబర్ 4న కమలాపూర్‌లో మహిళల ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం ఉంటుందని అన్నారు. తులం బంగారం, స్కూటీలు, మహిళలకు నెలకు రూ. 2500 తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 5న జమ్మికుంటలో ఫీజు రీయింబర్స్‌మెంట్, యూత్ డిక్లరేషన్, జాబ్ క్యాలెండర్ అమలు కోరుతూ యువత, విద్యార్థులతో ఆందోళన చేయనున్నారు. గ్రామపంచాయతీలు, ఆటో కార్మికుల పక్షాన పోరాటంలో భాగంగాసెప్టెంబర్ 6న ఉదయం 10 గంటలకు హుజురాబాద్, 11 గంటలకు జమ్మికుంట, 12 గంటలకు ఇల్లందకుంటలలో గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు, మోలిక వసతుల కొరత, ఆటో కార్మికుల సమస్యలపై భారీ ర్యాలీలు, నిరసనలు నిర్వహిస్తారని అన్నారు.

ప్రజావాణితో ప్రభుత్వానికి చురుకు...

సెప్టెంబర్ 7న నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రత్యేక ప్రజావాణి ద్వారా సమస్యలపై వేలాది వినతిపత్రాలు సేకరించి ప్రభుత్వానికి పంపుతారని, సెప్టెంబర్ 8న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైఫల్యాలపై వినతిపత్రం అందజేయడంతో ఈ పోరాటం ముగుస్తుందని కౌశిక్ రెడ్డి వివరించారు. ప్రజల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఈ న్యాయ పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఏ వర్గానికి కూడా న్యాయం చేయలేని ఈ అసమర్థ ప్రభుత్వం మెడలు వంచేదాకా విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఈ వారం రోజుల సమరభేరి కార్యక్రమాల్లో రైతులు, మహిళలు, యువత, ఆటో కార్మికులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, సాధారణ ప్రజానీకం పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కెడిసిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సిర్సపల్లి సర్పంచ్ పొల్సాని రామారావు, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సంపత్‌రావు, లింగారావు, తిరుపతిరెడ్డి, లక్ష్మణరావు, ఇరుమల్ల సురేందర్ రెడ్డి, ఆదివారం కౌన్సిలర్ గంది శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, ముక్క రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో పలు సమస్యలపై 13 దరఖాస్తులు స్వీకరణ

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 13 దరఖాస్తులు స్వీకరించారు.సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జమ్మికుంట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పద్మావతి, ఆర్ ఐ గడ్డం శంకర్, ఏవో మహమ్మద్ ఖాదర్ హుస్సేన్ తో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ఒకే వేదికపై కూర్చుని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. మొత్తం 13 అర్జీలు అందాయి.వాటిలో తహసిల్దార్ కి 6, మున్సిపల్ కమిషనర్ కి 1, మండల విద్యాధికారికి 2, మండల పంచాయతీ అధికారికి 1, హౌసింగ్ ఏఈ కి 1,ఎంపీడీవో కి 1,ఎలక్ట్రిసిటీ ఏఈ కి 1మొత్తం13 దరఖాస్తులు అందాయి. వచ్చిన ప్రతి అర్జీని అక్కడికక్కడే కంప్యూటర్ లో నమోదు చేసి, అర్జీదారులకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ నంబర్ ఇచ్చారు. దీంతో తమ దరఖాస్తు ఏ దశలో ఉందో ప్రజలు సులభంగా తెలుసుకోవచ్చు.ఈ సందర్భంగా ఎంపీడీవో పద్మావతి మాట్లాడుతూ "ప్రజల సమస్యలు జిల్లా కేంద్రాల చుట్టూ తిరగకుండా మండల స్థాయిలోనే పరిష్కారం దొరకాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని తీసుకువచ్చిందనీ తెలిపారు. ప్రతి



సోమవారం ఉదయం 10 నుంచి 1 వరకు అన్ని శాఖల అధికారులు ఇక్కడే అందుబాటులో ఉంటారనీ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని అర్జీలు ఇచ్చిన 15 రోజుల్లోగా పరిష్కారంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.గతంలో చిన్న సమస్య కోసం కూడా ప్రజలు జిల్లాకు వెళ్లాల్సి వచ్చేదనీ ఇప్పుడు మండల కేంద్రంలోనే అన్ని శాఖల అధికారులు ఒకే చోట ఉండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మా సమస్యను నేరుగా అధికారులకు చెప్పుకునే అవకాశం వచ్చిందని అర్జీదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, వైద్య శాఖల అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఆదర్శప్రాయుడు

జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ బాబుకి ఘన వీడ్కోలు

సైదాపూర్, ప్రభాతవార్త:

సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన వెన్నంపల్లి శ్రీనివాస్ బాబు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు.ఈ సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో తోటి ఉద్యోగులు,ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి భూక్యా యాదగిరి మాట్లాడుతూ...శ్రీనివాస్ బాబు తన సుదీర్ఘ సర్వీసులో ఎంతో అంకితభావంతో,క్రమశిక్షణతో పని చేశారని కొనియాడారు.తోటి ఉద్యోగులతో ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటూ,ప్రజలకు జవాబుదారీగా సేవలందించారని అభినందించారు. కార్యాలయ పురోభివృద్ధిలో ఆయన పాత్ర మరవరానిదని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాస్



ద్రావు దంపతులను తోటి సిబ్బంది శాలువా,పూలమాలలతో ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ బసీరోద్దిన్, ఏపీఓ రాణి,ఏపిఎం తిరుపతి, పంచాయతీ రాజ్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు మజీద్, గిరీష్ బాబు,సర్పంచులు రాయిశెట్టి చంద్రయ్య, పోతరాజు భబిత, పంచాయతీ కార్యదర్శులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో మాజీ చైర్మన్ సారబుద్ల రాజిరెడ్డి, మిట్టపల్లి కిష్టయ్య, కానుగంటి బిక్షపతి, కార్యాలయ సిబ్బంది,ఆయన విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో, సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.

హుజూరాబాద్ వార్త



జగ్గయ్యపల్లి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా దుగ్గినాల రవీందర్

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:



జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్ష,ఉపాధ్యక్ష,డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మేరకు జిల్లా నుండి వచ్చిన అధికారి నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అధ్యక్షునిగా దుగ్గినాల రవీందర్, ఉపాధ్యక్షుడిగా నిమ్మల సంపత్,కోశాధికారిగా నిమ్మల రవీందర్,సభ్యులుగా దుగ్గినాల సంపత్,దుగ్గినాల కొమురయ్య,నిమ్మల సంపత్,గుడెపు రవి, నిమ్మల సంపత్,సంపత్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని,మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షుడు రమేష్,ముదిరాజ్ కుల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన ఆర్టీసీ కార్గో సేవలు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:



గత నెల రోజులుగా నిలిచిపోయిన ఆర్టీసీ కార్గో సేవలు నూతన టెండర్ ప్రక్రియ పూర్తవడంతో తిరిగి పునఃప్రారంభమయ్యాయి. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్గో కేంద్రాన్ని డిపో మేనేజర్ (డీఎం) రవీంద్రనాథ్, పిసిసి ఏజెంట్, కార్గో నిర్వాహకులు గూటం ప్రశాంత్ ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ... పాత టెండర్ గడువు ముగియడంతో తాత్కాలికంగా ఆగిన కార్గో సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు. వ్యాపారులు, సామాన్య ప్రజల సరుకులను అత్యంత భద్రంగా, తక్కువ చార్జీలతో గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఆర్టీసీ కార్గో ఎంతో నమ్మకమైనదని పేర్కొన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్, కొరియర్ సంస్థలతో పోలిస్తే ఆర్టీసీ కార్గో ఎంతో విశ్వసనీయమైనదని, స్థానిక ప్రజలు, వ్యాపారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ డిపో సిఐ అంజలి, పర్యవేక్షక అధికారులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్, కార్గో విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాం నిర్మించాలని కలెక్టర్ కు వినతి

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:

మండలంలోని కోనరావుపేట గ్రామంలో మెట్లచిట్టాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఎరువుల గోదాం నిర్మించాలని జిల్లా కేంద్రంలో సోమవారం ప్రజవాణి కార్యక్రమంలో కలెక్టర్ కు గ్రామ రైతులు వినతిపత్రం అందచేశారు. గ్రామంలో గత 5సంవత్సరాల క్రితం ఎరువుల గోదాం నిర్మాణానికి 6గుంటల స్థలం మెట్లచిట్టాపూర్ సొసైటీ పేరట రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని,ఇప్పటి వరకు గోదాం నిర్మాణం జరగలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.కాగా ఎరువుల గోదాం లేకపోవడం వల్ల మెట్లచిట్టాపూర్ గ్రామం నుండి ఎరువులు తేవడం వల్ల ఒక్క యూరియా బస్తాపై అదనంగా రూ. 40లు ఖర్చు అవుతుందని రైతులు,రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఇకనైనా వెంటనే కోనరావుపేట గ్రామంలో ఎరువుల గోదాం నిర్మాణం చేయాలని వారు కోరారు.ఈకార్యక్రమంలో రైతులు మారు హన్మాండ్లు, జవిడి చిన్నారెడ్డి, పూండ్ర గంగారెడ్డి,మారు జనార్దన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్న మోడీ సర్కార్.

అంతర్గాం, ప్రభాత వార్త :

సామ్రాజ్య వాద దేశమైన అమెరికా లాంటి అగ్ర రాజ్యం తో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకున్న కేంద్రం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్నదని సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ అనుబంధ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు మేరుగు చంద్రయ్య అన్నారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో సెప్టెంబర్ 8,9 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రం లో నిర్వహించ తలపెట్టిన రైతు కూలీ సంఘం రాష్ట్ర మహా సభల పోస్టర్ ను ఆవిష్కరించి చంద్రయ్య ఈ మేరకు మాట్లాడారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా విత్తనాలు,



ఎరువుల ధరలు పెంచుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించి పరిపాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. సరియైన పంట దిగుబడులు రాక ఒకవైపు, గిట్టుబాటు ధరలు లేక మరో వైపు రైతాంగం తీవ్రంగా నష్టాల పాలు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వామి నాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిస్కారం కోసం ఉద్యమ కార్యచరణ ప్రణాళికలు రూపొందించనున్న మంచిర్యాల లో తలపెట్టిన రైతు కూలీ సంఘం మహా సభలకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో న్యూ డెమోక్రసీ, రైతు కూలీ సంఘం నాయకులు తూళ్ళ గట్టయ్య, ఉప్పులేటి లింగయ్య, బండి శ్రావణ్, పొనగంటి క్రాంతి కుమార్,నల్లతీగల రమేష్, పరకాల శ్రీశైలం, మంథని శ్రీనివాస్, బొడ్డుపల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధిలో మీ కృషి చిరస్మరణీయం

గోదావరిఖని, ప్రభాత వార్త:

సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు రామగుండం ఏరియా1 యాజమాన్యం ఘనంగా వీడ్కోలు పలికింది. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏజీఎం (సివిల్ క్వాలిటీ) నాగేశ్వరరావు, ఏజీఎం (ఈఅండ్ఎం) రాజాజీ, ఎస్టేట్ విభాగం ఆఫీస్ అటెండర్ బరుపటి పార్వతిని సన్మానించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా1 జీఎం డి. లలిత్‌కుమార్ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల అంకితభావం, నిబద్ధత కీలకమన్నారు. ఎన్నో ఏళ్లపాటు విధులు



నిర్వర్తిస్తూ ఎదురైన సవాళ్లను సమర్థంగా అధిగమించి సంస్థకు సేవలందించిన వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు కాదని.. జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని జీఎం అన్నారు. ఉద్యోగ బాధ్యతల నుంచి విముక్తి పొందిన అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. సింగరేణితో వారికి ఏర్పడిన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, సంస్థకు వారు అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు తమ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను సహచరులతో పంచుకున్నారు. సింగరేణిలో పనిచేసే అవకాశం కల్పించిన యాజమాన్యానికి, విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఉద్యోగ జీవితంలో సహచరులతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.కార్యక్రమంలో జీఎం క్వాలిటీ జే. వెంకటరమణ, ఎస్‌వోటు జీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీఎంఓఏఐ ప్రతినిధి సీహెచ్ రాజన్న, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం జీఎం కార్యాలయ ప్రతినిధి బి. పద్మ, ఏజెంట్11 గ్రూప్ చిలుక శ్రీనివాస్‌తో పాటు అధికారులు, పర్సనల్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు.

అధికారుల ఉదాసీన వైఖరి వల్లనే కాలరాయబడుతున్న అణగారిన వర్గాల హక్కులు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

జిల్లాలో అధికారుల ఉదాసీన వైఖరి వల్లనే అణగారిన వర్గాల హక్కులు కాలరాచబడుతున్నాయని, అట్రాసిటీ కేసుల దర్యాప్తులోనూ నిర్లక్ష్యం వీడకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఐక్య వేదిక నాయకులు హెచ్చరించారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై కుల వివక్ష కొనసాగుతున్నా జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాకుండా పేరుకుపోతున్నాయని, అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో బాధితుల్లో న్యాయంపై నమ్మకం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలను సైతం జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు ఆరోపించారు. జిల్లాలో కులాన్ని బట్టి న్యాయం జరిగే పరిస్థితులు నెలకొన్నాయని, ఇది సహజ న్యాయ సూత్రాలకు, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్‌తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వివక్ష



కొనసాగుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు విమర్శించారు. బాధితులు ఫిర్యాదులు చేసినప్పటికీ సకాలంలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదని, కేసులు నమోదు చేసిన అనంతరం కూడా వాటిని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినా ప్రయోజనం లేదనే భావన బాధితుల్లో ఏర్పడుతోందని, కేసులపై కఠిన చర్యలు తీసుకుంటేనే కుల వివక్షకు అడ్డుకట్ట వేయగలం" అని అన్నారు. జూలై 18న నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ రివ్యూ సమావేశంలో బాధితులు సమర్పించిన పలు దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. కమిషన్ సూచనలు, ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. నిట్టూరు పాఠశాల ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్ చేసారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో కుల వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలు పెరుగుతున్నా అధికారులు వాటిపై తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. పోలీసు, జిల్లా యంత్రాంగం తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. రాఘవాపూర్ గ్రామ కార్యదర్శి టి. రవీందర్‌కు మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయడం సమంజసం కాదని నాయకులు పేర్కొన్నారు. అకారణంగా సస్పెన్షన్‌కు గురైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అట్రాసిటీ కేసుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ఆల్ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. మొదట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆందోళనలు చేపడతామని, అవసరమైతే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మధు, జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, పెద్దపల్లి మాజీ ప్రజాప్రతినిధి కుక్క అశోక్తో పాటు పలువురు ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన, బ్లాక్ మార్కెట్‌కు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి రూరల్ ఎస్ ఐ మధుకర్ హెచ్చరించారు. కూర్మపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ ఐ మధుకర్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న ఆటో ట్రాలీని ఆపి తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బియ్యాన్ని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్ కు తరలించారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు.

పెద్దపల్లి వార్త

కరాటేలో రామగుండం విద్యార్థుల ప్రతిభ

ఎన్టీపీసీ,ప్రభాతవార్త:



హుజురాబాద్‌లో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2026లో రామగుండం జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో కటాస్, కుమిటి విభాగాల్లో రామగుండం విద్యార్థులు పతకాలు సాధించారు.బ్లాక్ బెల్ట్ కటాస్‌లో కీర్తి మహాజీ బంగారు పతకం, బ్లాక్ బెల్ట్ కుమిటిలో ఎం.కార్తికేయన్ బంగారు, కీర్తి మహాజీ వెండి పతకం సాధించారు. కలర్ బెల్ట్ కటాస్‌లో శివన్య, పి.వీర వెండి, నిహాల్ నందన్ కాంస్య పతకాలు, కుమితిలో శివన్య బంగారు, పి.వీర వెండి, నిహాల్ నందన్ కాంస్య పతకాలు సాధించారు.విజేతలను స్కూల్ అధ్యక్షుడు ఎం.రమేష్, కోచ్ శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు, తల్లిదండ్రులు అభినందించారు.

కామపిశాచిపై పీడీ యాక్ట్ పెట్టాలి

గోదావరిఖని, ప్రభాతవార్త: ....

..... గోదావరిఖని ప్రాంతంలో ఒంటరి మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని లైంగిక దాడులకు పాల్పడుతున్న నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు డిమాండ్ చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం హర్షణీయమేనని, అయితే అరెస్టుతోనే వ్యవహారాన్ని ముగించకుండా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలని కోరారు.వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం.. శివాజీనగర్‌కు చెందిన నిందితుడు సాయం చేస్తానంటూ మహిళలతో మాట కలిపి నమ్మించి, ద్విచక్ర వాహనంపై నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలను లక్ష్యంగా చేసుకోవడం అత్యంత దారుణమన్నారు. సీతానగర్ కూరగాయల మార్కెట్, బార్ పరిసరాలను అడ్డాగా చేసుకుని మద్యం, గంజాయి మత్తులో మహిళలను బెదిరించినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తనకు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తెలుసంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిందితుడి వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేయాలని కోరారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో నిందితుడిపై ఇప్పటికే నాలుగైదు కేసులు ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. భయంతో మరికొందరు బాధితులు ఫిర్యాదు చేయకుండా మౌనం వహిస్తున్నారనే సమాచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. అలాంటి బాధితులు ధైర్యంగా ముందుకొచ్చేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు కేసును వేగంగా విచారించి బాధితులకు త్వరిత న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని, రామగుండం ప్రాంతాల్లో ఒంటరి మహిళలు, కార్మిక మహిళల భద్రత కోసం ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని, షీ టీమ్స్ నిఘాను మరింత పెంచాలని కోరారు. నిందితుడికి రాజకీయ అండదండలు ఉంటే వాటిని వెలికితీసి, సంబంధిత వ్యక్తులపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళల జోలికి వస్తే కఠిన శిక్ష తప్పదనే సంకేతాన్ని ప్రభుత్వం ఇవ్వాలని, బాధిత మహిళలకు బీజేపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణి.

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట, మారేడుగొండ, పెద్దకల్వల, మేరపల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులు యూనిఫామ్స్ కుట్టి పాఠశాల అధికారులకు ఇవ్వడంతో వారు పాఠశాల విద్యార్థులకు అందజేశారు. 2026 2027 సంవత్సరానికి గాను మండలంలోని 54 పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులచే యూనిఫామ్స్ కుట్టించడం ద్వారా వారికి ఉపాధి లభించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అవుతున్నామని నిర్వాహకులు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలకు యూనిఫామ్స్ అందించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు, ఏపిఎం శాంతి శైలజ, సిసి అనాసి శ్రీనివాస్, వీవోఏ తదితరులు పాల్గొన్నారు.

చెడిపోయిన సెల్ ఫోన్ల కు ప్లాస్టిక్ సామాను దందా : పోలీసుల అదుపులో బీహార్ వ్యక్తి

మల్యాల, ప్రభాతవార్త:







చెడిపోయిన పాత సెల్ ఫోన్ లకు ప్లాస్టిక్ సామాను ఇస్తాం...అంటూ బీహార్ కు చెందిన ఓ వ్యక్తి మైక్ తో బైక్ పై వచ్చి పల్లెల్లో సెల్ ఫోన్ లను సేకరిస్తుండగా, అనుమానం వచ్చిన స్థానికులు అడ్డగించి 100 కు సమాచారం ఇచ్చి పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం మల్యాల మండలం మద్దట్లలో జరిగింది. స్థానికుల ద్వారా తెలిసిన వివరాల మేరకు, మద్దట్ల లో బీహార్ కు చెందిన యువకుడు బైక్ పై వచ్చి పాత సెల్ ఫోన్ లకు అందమైన ప్లాస్టిక్ వస్తువులను ఇస్తున్నాం అంటూ పలువురివద్ద సెల్ ఫోన్ లను సేకరించేందుకు ప్రయత్నిస్తుండగా సెల్ఫోన్లకే ఎందుకు ప్లాస్టిక్ సామాను ఇస్తున్నావు? డబ్బులకు అమ్మచ్చుకదా? అని అనుమానం వచ్చిన స్థానికులు ఆ వ్యక్తిని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం ఇవ్వడంతో వారు వెంటనే పోలీసులకు స్థానిక సర్పంచ్ తిరుపతికి సమాచారం అందించారు, సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని తనిఖీ చేయగా, అతని వద్ద కొన్ని సెల్ ఫోన్లు లభించాయి, అయితే బీహార్ కు చెందిన వ్యక్తి పల్లెల్లో సెల్ ఫోన్ లను మాత్రమే సేకరించే పనిలో పలుమార్లు తన సెల్ ఫోన్ నుండి ఇతరులకు లొకేషన్ షేర్ చేసినట్లు కూడా గుర్తించారు, సెల్ ఫోన్ల ద్వారా వ్యక్తిగత డేటా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉన్నందున ఈ దందా వెనుక అసలు ఏ జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు, దీంతో విచారణ నిమిత్తం వచ్చిన పోలీసులు ఆ వ్యక్తిని మల్యాల పోలీస్ స్టేషన్ కి తరలించారు.

మల్యాల ఠానా లో ఒకేరోజు ఇద్దరు ఏఎస్ఐల రిటైర్మెంట్

మల్యాల, ప్రభాతవార్త:



మల్యాల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏ ఎస్ ఐ లు ఒకే రోజు రిటైర్మెంట్ అయ్యారు, మల్యాల స్టేషన్ లో రుద్ర కృష్ణకుమార్, కొండగట్టు అవుట్ పోస్ట్ లో చిలుక శ్రీనివాస్ లు ఏ ఎస్ ఐ లు గా కొనసాగుతున్నారు, వీరిద్దరూ ఉద్యోగరీత్యా విధి నిర్వహణలో సమర్థవంతంగా సేవలందిస్తూ మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం, రుద్ర కృష్ణ కుమార్ కు గత ఏడాది విశిష్ట ఉత్తమ సేవా పతకం లభించగా, చిలక శ్రీనివాస్ విధి నిర్వహణలో ఉత్తమ సేవ పతకాల తో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రశంసలు అందుకున్నారు, అయితే వీరిద్దరూ సోమవారం ఒకే సారీ పదవి విరమణ పొందారు, ఈ సందర్భంగా, జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయం లో అడిషనల్ ఎస్పి చేతన్ నితిన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు, మల్యాల స్టేషన్లో ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో పదవి విరమణ పొందిన శ్రీనివాస్ కృష్ణ కుమార్ లను పోలీసు సిబ్బంది అభినందించారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గా తూడి లచ్చన్న

గంగాధర,ప్రభాతవార్త:



గంగాధర మండలం మల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన చైర్మన్గా తుడి లచ్చన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు హాజరై ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి నూతన చైర్మన్ కు ప్రొసీడింగ్ ను అందజేశారు.ఈ సందర్భంగా తుడి లచ్చన్న మాట్లాడుతూ...సంఘం అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. సంఘం సభ్యులు మత్స్యకారులు తూడి లచ్చన్న కు అభినందనలు తెలిపారు.

మల్యాల లో మటన్ షాపులపై ప్రజావాణిలో ఫిర్యాదు

మల్యాల, ప్రభాతవార్త:



మల్యాల మండల కేంద్రంలో మటన్ షాపులను డ్రైనేజీలు, రోడ్డు పక్కన అపరిశుభ్రమైన స్థలాలలో నిర్వహిస్తున్నారని, దీనివలన ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెటర్నరీ డాక్టర్ నిర్ధారించి అమ్మకానికి ముద్ర వేసిన తర్వాతే మాంసాన్ని విక్రయించాలని, పూర్తి పరిశుభ్రత, స్వచ్ఛత కలిగిన షాపులలోనే మటన్ విక్రయాలు జరిపేందుకు అధికారులు చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని సోమవారం జరిగిన ప్రజావాణి లో తాజా మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేష్, మండల బిజెపి నాయకులు ముదుగంటి రాజు, మధు తో పాటు స్థానికులు ఫిర్యాదు చేశారు, ఈ మేరకు మండల ప్రజావాణి నోడల్ అధికారి స్వాతి, తహసిల్దార్ శ్రీనివాస్ లకు వినతిపత్రం అందజేశారు.

విరమణ పొందుతున్న ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

మల్లాపూర్ ప్రభాతవార్త:



మండలంలోని సిర్పూర్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన శ్రీపాద వెంకటరమణకు గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు సోమవారం పాఠశాల లో వెంకటరమణ దంపతులను ఘనంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా చిట్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో 13 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ పదవి విరమణ పొందిన బసాని మెల్కీయోర్ ను శాలువాతో సన్మానించి వీడ్కోలు కార్యక్రమం జరిపించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలలో ఇరువు గ్రామాల సర్పంచులు పెంట సౌజన్య శ్రీనివాస్, సంపతి శంకరమ్మ ఆశాలు, ఉప సర్పంచ్లు సోమ నాగార్జున రెడ్డి, బాల్సాని ప్రణయ్ గౌడ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దామెర రాజశేఖర్ రెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి వార్త

పోతారం సింగిల్ విండో అభివృద్ధికి సహకరించాలి

నూతన చైర్మన్ కొల్లూరి గంగాధర్

మల్యాల, ప్రభాతవార్త:



ప్రభుత్వం నూతన పాలకవర్గంతో ఏర్పాటు చేసిన మల్యాల మండలం పోతారం సింగిల్ విండో అభివృద్ధికి సహకరించాలని పాక్స్ చైర్మన్ కొల్లూరి గంగాధర్ కోరారు, సోమవారం ఈ మేరకు జగిత్యాల జిల్లా సహకార సంఘాల సీఈవో మనోజ్ కుమార్ ను మర్యాదగా పూర్వకంగా కలిసి బొకే అందజేశారు, సింగిల్ విండో పరిధిలో రైతులకు మెరుగైన సేవలు అందించి, సంఘం ఆధ్వర్యంలో అన్ని విధాల అభివృద్ధి పరిచి ఆదర్శ సింగిల్ విండో గా తీర్చిదిద్దుటకు గాను సహకరించాలని ఈ సందర్భంగా సీఈఓ ను చైర్మన్ గంగాధర్ కోరారు.

ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందజేసిన తూడి లచ్చయ్య

గంగాధర,ప్రభాతవార్త:



గంగాధర మండలం మధురనగర్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులు కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సామాజిక వేత్త తూడి లచ్చయ్య హాస్పిటల్ కు వెళ్లి పరమర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పడంతో పాటు చికిత్సకు ఆర్థికసహాయం అందజేశారు. చేల్లోజీ వెంకటాచారి కి10,000, అతికం మమత కు 5,000, చొప్పదండి శైలజ కు 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న తూడి లచ్చయ్య సేవా భావం అభినందనీయం కొనియాడారు.ఈ కార్యక్రమంలో టి ఎల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో శ్రావణ సందడి

మల్యాల, ప్రభాతవార్త:



జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రావణమాసం సందడి నెలకొంది, సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఆలయానికి తరలివచ్చి శ్రీ స్వామివారిని దర్శించు కుంటున్నారు, సోమవారం ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుండి భక్తులు కొండపైకి చేరుకొని పుణ్యస్నానం ఆచరించి శ్రీ స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు, అనంతరం శ్రీ బేతాళ స్వామి వారి ఆలయంలో కూడా దర్శించుకున్నారు, ఆలయ ఏ ఈ ఓ హరి హరినాథ్ ఆధ్వర్యంలో అధికారులు రాజేందర్ రెడ్డి, జెమిని శ్రీనివాస్ భక్తులకు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షి ంచారు.

తక్కలపల్లి లో ఇందిరమ్మ గృహం ప్రారంభం

మల్యాల ,ప్రభాతవార్త:

మల్యాల మండలంలోని తక్కలపల్లి లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పొంది ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారు గంపల లావణ్య స్వామిల నూతన గృహాన్ని సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా తమకు ఇల్లు మంజూరు అయినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో అనిల్, లచ్చన్న, సాగర్, లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, రమణ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధి చేస్తాం

- వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో 32 ఏజెండా అంశాల పై తీర్మానం

వేములవాడ టౌన్, ప్రభాత వార్త





వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. వేములవాడ పట్టణ ప్రగతి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణే ధ్యేయంగా అధికారులు సభ ముందుకు తీసుకొచ్చిన 32 ఏజెండా అంశాలను సభ్యులందరూ సమగ్రంగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ. 94 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 15,000 మొక్కలను పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా రూ. 15 లక్షలు కేటాయిస్తూ కీలక తీర్మానం చేశారు.సమావేశం ముగిసిన అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా తమ కౌన్సిల్ పనిచేస్తోందని స్పష్టం చేశారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, మార్గదర్శకత్వంతో మున్సిపాలిటీకి అవసరమైన ప్రత్యేక నిధులను సమకూర్చుకుంటున్నామని తెలిపారు. పట్టణంలో రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచడానికి వేగవంతంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుతం వర్షాకాలం నడుస్తున్నందున పట్టణ ప్రజలు ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ కోరారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పురపాలక వర్గాలు క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా, ఎక్కడా డ్రైనేజీలు పొంగిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వార్డులో కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ పనులు చేపట్టాలని సూచించారు. సీసనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ లోకేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమన్నను దర్శించుకున్న సమాచార కమిషన్ కార్యదర్శి భారతి

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శి భారతి లక్పతి సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ డీఈఓ ప్రతాప్ నవీన్ కుమార్ వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలి

బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలం లోని వివిధ గ్రామాలలో అక్రమ మట్టి రవాణా చేస్తున్నారని అక్రమ మట్టి రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బోయిన్ పల్లి మండల ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య మాట్లాడుతూ మండలంలో ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా చేస్తున్నరని తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మట్టి అక్రమ రవాణా నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుదాం

బిఆర్ఎస్ మల్యాల దేవయ్య

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో చేసిన వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లెల దేవయ్య పిలుపునిచ్చారు. సోమవారం కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించడంతో పాటు, వాటి అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎండగడుతూ సెప్టెంబర్ 2వ తేదీన వేములవాడలో నిర్వహించే ధర్నా, రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహిస్తునామన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, దేవరకొండ తిరుపతి, చంద్రయ్య గౌడ్, భూమిరెడ్డి, సర్పంచులు స్వామి, బొజ్జ మల్లేశం,ఉప సర్పంచ్ తిక్కల నవీన్,గోపు పర్శరాములు,ఆరె మహేందర్,శ్రీనివాస్, శివతేజ, శ్రీనివాస్, బెదిరే దేవయ్య పాల్గొన్నారు.

మూడపల్లి లో సివిల్ రైట్స్ డే

చందుర్తి: ప్రభాత వార్త



చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో సోమవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అంటరానితనం నిర్మూలనకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. స్థానిక సర్పంచ్ చిలుక మల్లేశ్వరి అంజిబాబు మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సతీష్. జిపిఓ నర్మద. పంచాయతీ కార్యదర్శి సంధ్య అంగన్వాడి ఉపాధ్యాయులు. ఆశా కార్యకర్తలు.వార్డు సభ్యులు పాల్గొన్నారు,

వేములవాడ వార్త

భీమన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారిని దర్శించుకున్న 50వేల మంది భక్తులు

వేములవాడ, ప్రభాతవార్త:



శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయం భీమన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. వాటర్ షవర్ల కింద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, కూలైన్‌ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకొని సత్యనారాయణ వ్రతాల లో పాల్గొన్నారు. భక్తుల రద్దీ నేపథ్యం లో దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, ఈఈ రాజేష్ క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు, కోడె మొక్కులు, టికెట్ కౌంటర్లు, చెక్ పోస్టులను స్వయంగా పర్యవేక్షించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పిఎఫ్, హోంగార్డు సిబ్బందికి సూచించారు. దాదాపు 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.



అరెకటిక సంఘం భవనానికి భూమి పూజ

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న వేములవాడ ఆరెకటిక సంక్షేమ సంఘం భవనానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం భూమి పూజ చేశారు. సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు మల్యాల, తక్కలపల్లి లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, ప్రభాతవార్త;

మల్యాల మండలం తాటిపల్లి, మానాలలో విద్యుత్ ఫీడర్ల లోని లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను సెప్టెంబర్ 1న తొలగించే పనులు చేపడుతున్న ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మల్యాల ఏ ఈ దయానంద తెలిపారు,దీనివల్ల మల్యాల మండల కేంద్రంతో పాటు తక్కల్లపల్లి గ్రామ గృహ, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారుల సహకరించాలని కోరారు.

మంచం పట్టిన పల్లె ప్రజలు

వణుకు పుట్టిస్తున్న వైరల్ ఫీవర్స్
ప్రతి ఇంట్లో ఒకరు జ్వర పీడితుడు
దోమల స్వైర విహారానికి
బేజారవుతున్న జనాలు
కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

మంథని ప్రభాతవార్త:



వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వలన మంథని ప్రాంతంలో వైరల్ జ్వరాలు విజింభిస్తున్నాయి. ఈ వైరల్ జ్వరాల మూలంగా ప్రతి ఇంటిలో ఒకరు జరపీడితుడుగా మారి మంచానికి పరిమితం అయిపోతున్నారు. పట్టణంలో, గ్రామాల్లో విచ్చలవిడిగా దోమలు స్వైర విహారం చేయడంతో దోమల బారిన పడ్డ వారంతా జ్వరాల బారిన పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్న దోమలు మాత్రం యధావిధిగా తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అక్కడ దోమలు రెచ్చిపోయి ప్రజల పైన దాడులు చేస్తున్నాయి. దోమ కాటుకు గురైన ప్రజలు క్రమక్రమంగా జ్వర పీడితులుగా మారుతున్నారు. గ్రామాల్లో పట్టణాల్లో ఏఎన్ఎంలు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడి ఆస్పత్రిల పాలవుతున్నారు. అందిన కాడికి దోచుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రిలు సీజనల్ జ్వరాలు రోజురోజుకు పెరిగిపోతుడటంతో ప్రజలు గ్రామాల్లోని పట్టణంలోని ప్రవేట్ ఆసుపత్రులను ఆశ్రయించటంతో వారు స్థానికు ప్రజలను దోచుకుంటున్నారు. జ్వరం బారిన పడ్డవారు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే అక్కడ వారు నేరుగా సెలైన్ బాటిల్స్ పెట్టి అడ్డగోలుగా మందులు రాసి ఇంజక్షన్లిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు . దీనితో ప్రజలు అప్పులు చేసి ఆసుపత్రుల బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లన్నీ జ్వర పీడితులతో నిండిపోయి ఉంది. ఆసుపత్రి నుండి ఒకరు డిశ్చార్జ్ అయితే ఐదుగురు జ్వరంతో చేరుతున్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు వైరల్ ఫీవర్స్ పెరిగిపోతున్నాడంతో ప్రజలు మంచన పడుతున్నారు. గ్రామాల్లో వైద్యం అందుబాటులో



లేకపోవడంతో వారు మండల కేంద్రంలోని రావడానికి ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వ వైద్యులు దీనిపైన స్పందించే గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ జ్వరాల బారిన పెద్ద వారికి వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి స్థానికంగా ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో వారు గ్రామాల్లోని ప్రైవేట్ వైద్యం ఆశ్రయించాల్సి వస్తుంది దీనితో ఒల్లు గుల్ల చేసుకోవడంతో పాటు జేబుకు చిల్లి పడాల్సిన అవసరం పడుతుంది. పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి ప్రస్తుతం జ్వరాల సీజన్ కావడంతో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరా పరిశుభ్రతను పాటించాలని పలువురు వైద్యులు తెలిపారు. వర్షాకాలం కావడంతో మంచినీటి విషయంలో తప్పకుండా శ్రద్ధ వహించాలని కలుషిత నీరు తాగడంతో జ్వరాలు తో పాటు విరోచనాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తాగే నీటి విషయంలో తప్పకుండా పరిశుభ్రత పాటించాలని వారు సూచించారు. అదేవిధంగా దోమలు రాకుండా చూసుకోవాలని ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న ఇంటిలో దోమతెరలను ఉపయోగించుకోవాలని వారు అన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు రాకుండా ఉంటాయని అన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారికి ఆత్మీయ సన్మానం

రామగిరి ప్రభాతవార్త



రామగుండం ఆర్జీ3 జి.ఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన ఏరియా పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి నీ, రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఏరియా లోని వివిధ గనుల, విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజారెడ్డి సింగరేణి సంస్థలో సుమారు 38 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు, విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో,అంకి తభావంతో అందించిన సేవలు అందరికీ,ఆదర్శమన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యా లతో గడపాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అడ్రియాల లాంగ్ వాల్ గని లో ప్రాజెక్ట్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తు పదవి విరమణ పొందిన టి.రఘురామ్ ను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వివిధ గనుల, విభాగాల అధిపతులు ఘనంగా సన్మానించారు. వారు వివిధ హోదాలలో అంకితభా వంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జిఎం బండి సత్యనారా యణ, ఏరియా ఇంజినీర్ వి.దూప్ సింగ్, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు బి.టి.మురళీకృష్ణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్ విభాగాధిపతులు కె.ఐలయ్య, అఫ్సర్ పాషా, ఆర్.రాజేశ్వరి, రవిచరణ్, షబ్బీరుద్దీన్, శ్రీహర్ష, యండి.ఆసిఫ్, మనోజ్ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో ఘనంగా పదవీ విరమణ సన్మానం

రామగిరి ప్రభాతవార్త



అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో సోమవారం, ప్రాజెక్ట్ ఇంజనీర్ టి. రఘురాం , ఎలక్ట్రికల్ ఫోర్‌మన్ ,మేకల మల్లేశం , జనరల్ అసిస్టెంట్ కెమెరా చిన్న లింగయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర్ రావుముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిఎం కొలిఎాక నాగేశ్వం రావు మాట్లాడు తూ, టి.రఘురాం తో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని, ఉద్యోగ జీవితంలో కలిసి పనిచేసిన అనుభవాలను, వారి మధ్య కొనసాగిన ఆత్మీయ సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రఘురాం తో కలిసి పనిచేసిన రోజులను, సంస్థ అభివృద్ధి కోసం ఆయన అందించిన సేవలను మరియు విధుల పట్ల ఆయన చూపిన నిబద్ధతను ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. రఘురాం తో పాటు పదవీ విరమణ పొందుతున్న కెమెరా చిన్న లింగయ్య, మేకల మల్లేశం కూడా సంస్థకు అందించిన సేవలను అభినందిస్తూ, వారి సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ముగ్గురూ ఆరోగ్యంగా, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించా రు.ఈ సందర్భంగా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సంస్థకు అందించిన సేవలను కొనియాడారు. వారి సుదీర్ఘ సేవలను అభినందిస్తూ, పదవీ విరమణ అనంతరం వారి జీవితం సుఖసంతోషా లతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిం చారు.పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ సేవా కాలంలో సహకరించి న అధికారులకు, సహోద్యోగులకు కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏరియా ఇంజనీర్ ధూప్ సింగ్, ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ అధికారి బండి సత్యనారాయణ, ఎఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వై.వి. రావు , ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, గని మేనేజర్ హస్తి పెంచలయ్య, ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి ఎప్ప గంగాధర్, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి మండల కొమురయ్య , ఏఎల్‌పీ పాల్గొన్నారు.



గ్రామస్థాయిలో ఉన్న సమస్యలుపరిష్కరించేందకే ప్రజావాణి



రామగిరి ప్రభాతవార్త

గ్రామస్థాయిలో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించేం దుకే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహిస్తుందని ఎంపీడీవో శైలజ రాణి అన్నారు. రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా మూడు దరఖాస్తులు రాగా ఇందులో పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని వకిలి పల్లె నుండి పారిశుద్ధం పై రత్నాపూర్ గ్రామపంచాయతీ రెండో వార్డ్ లో సిసి రోడ్డు మరియు డ్రైనేజ్ నిర్మాణం గురించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు గురించి దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ ఎన్ ప్రసాద్ రావు ఎస్సై తాడవేణి శ్రీనివాస్, ఎంపీ ఓ. సమ్మిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ యజ్ఞంపట్ల మానస, వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, ట్రాన్స్ కో ఏఈ,మహేందర్ రెడ్డి, ఎంఈఓ కొమురయ్య, పిఆర్ ఏఈ వరలక్ష్మి, సూపరింటెండెంట్ దేవరకొండ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర ధరల పెంపుపై నిరసనగా ఛాయ దుకాణాలు బందు

మంథని ప్రభాతవార్త:



చక్కెర ధరతో పాటు నిత్యవసర సరుకుల ధరలు అమాంతం పెరగడాన్ని నిరసిస్తూ సోమవారం మంథని పట్టణంలోని అన్ని టీ షాపులు స్వచ్ఛందంగా మూసివేయడం జరిగింది. పాల ధర, చక్కెర, టీ పొడి ధరలు భారీగా పెరగడంతో టీ షాపుల నిర్వహణ భారంగా మారిందని చాయ్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ధరల పెంపును వెంటనే నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ బంద్ కు పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ బంద్ లో మంథని పట్టణంలోని ప్రముఖ టీ షాపులు సిటీ టీ ప్యాలెస్, చిరు టీ స్టాల్, లక్కీ టీ స్టాల్, ఉడిపి హోటల్ టీ స్టాల్, మొగిలి టీ స్టాల్ పలు షాపుల యజమానులందరూ పాల్గొన్నారు.

వకీల్‌పల్లి డ్రైనేజీలను శుభ్రపరచాలి

రామగిరి ప్రభాతవార్త

పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్లలో పేరుకుపోయిన సిల్ట్, మట్టిని తొలగించి డ్రైనేజీలను శుభ్రపరచాలని కోరుతూ బిజెపి సెంటినరీ కాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, బిజెపి సీనియర్ నాయకులు మేరుగు శ్రీకాంత్ సోమవారం ప్రజావాణిలో డిప్యూటీ తాసిల్దార్ యజ్ఞం పట్ల మానస కు వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీలలో మట్టి, సిల్ట్ పేరుకుపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు సక్రమంగా ప్రవహించడం లేదని తెలిపారు. వర్షాకాలంలో నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశంఉందన్నారు. అలాగే గృహ నిర్మాణాలు, ఎర్త్ వర్క్ సమయంలో కొంతమంది ప్లాట్ యజమానులు డ్రైనేజీలను మట్టి, నిర్మాణ సామగ్రితో మూసివేస్తున్నారని,.మూసివే యబడిన డ్రైనేజీ మార్గాలను గుర్తించి వెంటనే పునరుద్ధరించాలని కోరారు. భవిష్యత్తులో డ్రైనేజీలను మూసివేయకుండా ప్లాట్ యజమానులకు సూచనలు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని ఈ వినతి పత్రంలో కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెగడపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని దేవికొండ, కీమలాటపల్లి గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక సర్పంచులు నామ సురేందర్‌రావు, రాచకొండ ఆనంద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా బుర్ర రాములు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు పెద్ద ఎత్తున రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిరంతర ప్రక్రియలో మంజూరు చేస్తూ వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో రాజారాం పల్లి సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, ఉపసర్పంచ్‌లు ఈరి కనకయ్య, ఏగుర్ల మహేందర్, జీపీఓలు అపర్ణ, నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చెట్ల కిషన్, లింగంపల్లి మహేష్, గోవూరి సతీష్‌రెడ్డి, లైసెట్టి శంకరయ్య, తిరుపతి, సద్వాల శ్రీనివాస్, కొత్తపల్లి రవీందర్, తొట్ల కుమార్, వేముల తిరుపతి, ఇరుగురాల దుర్గయ్య, కొత్తపల్లి నరసింగం, గాజుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో కంటి వెలుగులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పంద

78 మందికి కంటి పరీక్షలు..

38 మందికి ఉచిత శస్త్రచికిత్సలకు ఎంపిక



గొల్లపల్లి, ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని ధర్మపురి సీఐ రామ నరసింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచితంగా పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమం అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు కంటి వెలుగును అందించాలనే సంకల్పంతోనే రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో ఈ మహత్కార్యాన్ని చేపట్టినట్లు తెలిపారు. శిబిరానికి విచ్చేసిన 78 మందికి రేకుర్తి కంటి ఆసుపత్రి నిపుణులు అధునాతన పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో తీవ్ర కంటి సమస్యలతో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమైన 38 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. ఎంపికైన రోగులను లయన్స్ క్లబ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు.వారికి ఉచిత కంటి ఆపరేషన్ తో పాటు కళ్లజోళ్లు భోజన, రవాణా సదుపాయాలను లయన్స్ క్లబ్ పూర్తిగా ఉచితంగా సమకూరుస్తోంది. వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి స్థానిక ఉపసర్పంచ్ భోజన వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి, సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్, ఉపసర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి,పూర్వ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి,పూర్వ కార్యదర్శి నరహరి, కోశాధికారి సట్ట సురేష్, లయన్ సభ్యులు మునిగాల మల్లేశం, శనిగరపు మల్లేశం, లీడ్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ తాడూరి శ్రీనివాస ఆచార్య, కచ్చు కొమురయ్య, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు.

గోదావరి వద్ద చెత్త డంపింగ్‌ను నిలిపివేయాలి

. డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి.

ధర్మపురి, ప్రభాతవార్త: గోదావరి సమీపంలో చెత్తను డంపింగ్ చేయడం వల్ల నది కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని,చెత్త డంపింగ్ ను నిలిపివేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరి వద్ద చెత్త డంపింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే చెత్త గోదావరిలో కలిసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి సమీపంలో చెత్త డంపింగ్ చేయడం వల్ల బోయవాడ ప్రజలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో చెత్త డంపింగ్ కోసం గుర్తించిన స్థలాలకు చెత్తను తరలించి గోదావరిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు అయ్యోరి రాజేష్,బండారి రంజిత్, చిలువేరి శ్యామ్, చిర్నేని నర్సయ్య,చుక్క రవి, పెరుమాండ్ల ఎల్లగౌడ్, బాకీ శేఖర్ పాల్గొన్నారు.



సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి

గొల్లపల్లి, ప్రభాతవార్త : సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి పేర్కొన్నారు.గొల్లపల్లి మండలంలోని చందోలి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యం లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను సి ఐ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నిరోధించడంతో పాటు, ఏదైనా నేరం జరిగిన సందర్భంలో నిందితులను గుర్తించడానికి, నేరాలను ఛేదించడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన రహదారులు, గ్రామ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ భద్రతను మరింత పటిష్టం చేసుకోవచ్చన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకే కాకుండా గ్రామ ప్రజల భద్రత కోసం నిరంతర పర్యవేక్షణ వ్యవస్థగా కూడా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం. కృష్ణసాగర్ రెడ్డి, సర్పంచ్ జక్కుల పావని దస్తగిరి, ఉప సర్పంచ్ దొనకొండ గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ధర్మపురి వార్త



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల యాప్‌ను రద్దు చేయాలి

ఎంపీడీవో కు వినతి పత్రం

ఎండపల్లి ప్రభాతవార్త కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఎండపల్లి మండల అధ్యక్షులు చెన్న కుమార స్వామి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో దొండ కృపాకర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల్లో చాలామంది నిరక్షరాస్యులు ఉన్నారని వారికి యాప్ పై సరైన అవగాహన లేక, సాంకేతిక కారణాలతో సమయానికి రైతులకు యూరియా అందడం లేదని, యూరియా యాప్ ను తక్షణమే రద్దుచేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని కోరారు.

లింగాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం

పెగడపల్లి, ప్రభాతవార్త:



లింగాపూర్ గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ కాశెట్టి వీరేశం అన్నారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రెవిన్యూ ఇన్స్పెక్టర్ జమున మాట్లాడుతూ పౌర హక్కులు కేవలం చట్టపరమైన అంశాలు మాత్రమే కాకుండా వ్యక్తి గౌరవం, స్వేచ్ఛ, సమానత్వానికి ప్రాథమిక ఆధారాలని వివరించారు. గ్రామ ప్రజలకు హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ సరోజినీ, జీపీ ఓ అజీముద్దీన్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో అభిషేకం.

దేవాలయంలో భక్తుల సందడి

ధర్మపురి, ప్రభాతవార్త:



శ్రావణ మాసం,సంకష్టహర చతుర్థి సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన. శ్రీ గణపతి ఆలయంలో అర్చకులు,వేద పండితులు అభిషేకం నిర్వహించారు. ఉదయం వేళలో స్వామివారికి గణపతి ఉపనిషత్తులు, మన్య సూక్తంతో పూజలు, అభిషేకం నిర్వహించారు.అనంతరం హారతి,మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు పవిత్ర గోదావరి స్నానాలు ఆచరించిన అనంతరం గణపతి ఆలయంతో పాటు శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవాలయంలో భక్తుల సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంతో అభివృద్ధి చేశాను

మాజీ సీఎం కేసీఆర్ తో నే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు

మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రివర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి మాజీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అవకాశవాదం, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ పై మాట్లాడాను.ఎమ్మెల్యే సంజయ్ వాస్తవానికి అనుగుణంగా మాట్లాడాలి.రాష్ట్రంలో పచ్చ కాంగ్రెస్ నడుస్తుందని, అఖిల భారత కాంగ్రెస్ కు అనుగుణంగా కొనసాగడం లేదు అని కాంగ్రెస్ పార్టీ నీ విభేదించి బయటకు వచ్చి బీ ఆర్ ఎస్ లోచేరిన..నేను ఇందిరా గాంధీని విమర్శించినట్లు ఎమ్మెల్యే సంజయ్ ఆరోపణలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.బీఆర్ఎస్ పార్టీలో చేరిన మూడు నెలల తర్వాత ఓ ప్రైవేట్ టీవీ కి జీవన్ రెడ్డి ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడిన వీడియో విలేఖర్లకు చూపించారు .ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన్నట్టు అందరూ ఎమ్మెల్యే లాగా ఉంటారనుకుంటే ఎలా..నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ ఎక్కడి నుండి వచ్చింది.. కేసీఆర్ దయతో రెండు సార్లు ఎమ్మెల్యే అయినావు... కేసీఆర్ ప్రత్యేక కోటా కింద 4000 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించారు.ఎవరి మెప్పు కోసం కెసిఆర్ కాలనీకి ఇందిరమ్మ పేరు పెట్టినట్లు ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి..కెసిఆర్ దూర దృష్టి తో 33 జిల్లాల్లో 33 మెడికల్ కాలేజీ లు ఏర్పాటు చేశారు. జీవన్ రెడ్డి ఏం చేసిండు అంటేకళ్ళుండి చూస్తే కనపడుతుంది..తెలంగాణ ప్రాంతానికి ఒకటే జే ఎన్ టి యూ కళాశాల మంజూరు అయితేఅది జగిత్యాలలో ఏర్పాటు చేసిన.పోలసలో వ్యవసాయ కళాశాల చేసిన.. న్యాక్ శిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన.25 ఎకరాల్లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేసిన..2009 లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 4000 ఇళ్ల కోసం స్థల సేకరణ చేసి, ఇళ్ళు మంజూరు చేయించిన.1600 ఇళ్ళు వివిధ దశల్లో ఉన్నాయని నిధులు మంజూరు చేయాలని సీఎం కు వినతిపత్రం ఇచ్చాను..పార్లమెంట్ ఎన్నికల వరకు పార్టీ సభ్యుడిగా ఉపాధి హామీ కింద 10 కోట్లు, ప్రత్యేక అభివృద్ధి కింద 10 కోట్లు మంజూరు చేయించిన..నూతన అభివృద్ధి ప్రతిపాదనలు చేసిన..హైదరాబాద్ రామగుండం రాజీవ్ రహదారి మంజూరు చేయించిన. పల్లె పల్లెకు రోడ్లు వేసిన.. మీరు కనీసం రోడ్లు అయినా మరమతు చేపట్టారా..జగిత్యాల,రాయికల్, బీరుపూర్ మండలాల్లో సి పీడబ్యూ స్కీమ్ పునరుద్ధరణకు 14 కోట్లు మంజూరు చేయించిన..జగన్నాథ్ పూర్ బోర్నపల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి 18 కోట్లు చేయించిన..బీ ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు కస్టపడి గెలిస్తేఆరు నెలల్లోనే రేవంత్ రెడ్డి సంకన చేరావు..రెండేళ్ల నుండి నువ్వేం చేసినావ్..కాళ్ళాళ్ల కట్టే అడ్డుపెట్టినట్టు నువ్వు కాంగ్రెస్ లో చేరివునవ్..నేను పచ్చ కాంగ్రెస్ లో కొనసాగలేప్రజల పక్షాన బీ ఆర్ ఎస్ పార్టీ తరపున కోట్లేందుకు బయటకు వచ్చిన..సర్వే నంబర్ 138 లో పెట్రోల్ బంక్ కు ట్రైటిల్ లేదని కోర్టు స్పష్టం చేసింది.. న్యాయ సలహా తీసుకుంటామనిజిల్లా కలెక్టర్ చెప్పి పది నెలలు అవుతున్నా ఎటువంటి చర్యలు లేవు..మున్సిపల్ ఆస్తి ఆక్రమణకు గురి అవుతున్న..ప్రభుత్వ ఆస్తులు కాపాడే బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని నిలదీశారు.. పెట్రోల్ బంక్ స్థలములో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకావాలని ఎమ్మెల్యేకు సూచించారు..ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ లో చేరి రెండేళ్లు అవుతుంది..ప్రభుత్వ ఆస్తులు కాపాడటం అభివృద్ధిలో భాగం అవుతుందా కాదా ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి..సర్వే నెంబర్ 138 లో కేవలం 4 గుంటల్లో మాత్రమే కొనసాగుతుంది..మిగిలిన భూమిలో అక్రమ నిర్మాణాలకు చేపట్టారు. ఇన్నేళ్లు ఏమైంది.. ఇప్పుడు ఎమ్మెల్యే గా అధికార పార్టీ లో ఉన్నావు..అయినా ఎందుకు చర్యలు చేపట్టడం లేదు..కలెక్టర్ నిశబ్దంగా ఉంటే ఎమ్మెల్యేగా మీరు ఏం చేస్తున్నారు అని నిలదీశారు.పాత బస్టాండ్ లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు 2023 లో టెండర్లు కూడా పిలిచారు.. ఇన్నేళ్లు ఎమ్మెల్యేగా నువ్వే ఉన్నావ్ కదా ఏం చేసినావు అని ప్రశ్నించారు.పాత బస్టాండ్ లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు లేఖ రాసిన..పాత బస్టాండ్ లో పోలీస్ కార్టర్ లో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగంలో ఉండే అవకాశం ఉండగా.. రెవెన్యూ కార్యాలయాలు ఉన్నచోట పెట్రోల్ పంపు ఏర్పాటు చేస్తున్నారు.కలెక్టర్ కూడా చట్టానికి లోబడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటది. కలెక్టర్ ఎటువంటి టెండర్ పిలవకుండా ఏకపక్షంగా ఐ ఓ సి కి లీస్ డీడ్ ఇచ్చారు..పక్కనే ఉన్న జర్నలిస్ట్ కార్యాలయ భవనం 30 ఫీట్లకు 75 వేలకు అద్దె వస్తుండగా.. అంతకు రెండింతలు భూమిని 72 వేలకు అద్దెకు ఇవ్వడం వెనక ఎవరి హస్తం ఉన్నది..మున్సిపాలిటీ నిద్ర పోతుంది.. జిల్లా కలెక్టర్ నిద్ర పోతున్నాడు.. టియూఎఫ్ఐడిసి కింద కాంట్రాక్ట్ అగ్రిమెంట్ లేకుండా పని ఇస్తారా.. అది ఎత్తి చూపితే ఎటువంటి చర్యలు లేవు.. సక్రమంగా పని చేయాలని అనడం తప్పా..అని నిలదీశారు.కండ్లపల్లి, తిమ్మాపూర్, గోపాలరావు పేట, వెల్దుర్తి. రోడ్లకు కనీసం మరమతు చెయ్యాలని ఎమ్మెల్యేకు సూచించారు. ఎందుకు పార్టీ మారినావు అని నీ ఆత్మకు తెలియాలి..మీ బిల్లుల కోసమా..అభివృద్ధి కోసమా..మున్సిపల్ ఆస్తి ఆక్రమణదారులను కాపాడేందుకు పార్టీ మారిండు అనిభావిస్తున్నాం..జగిత్యాల్ ప్రజలందరికీ తెలుసు మీరు పార్టీ ఎందుకు మారినారో..అని ఎమ్మెల్యే సంజయ్ ను నిలదీశారు.మున్సిపల్ ఆస్తి పెట్రోల్ బంక్ స్థలం సుమారు వంద కోట్ల ఆస్తి..బీప్రభుత్వ ఆస్తి కాపాడటం బాధ్యత..ఎందుకు సైలెంట్గా ఉంటున్నావు..నీకు కూడా భాగస్వామ్యం ఉంది అని భావించాల్సి వస్తుంది.పెట్రోల్ పంపు స్థలం పై న్యాయ సలహా తీసుకుంటామని కలెక్టర్ చెప్పి 10 నెలలు గడుస్తుంది.జగిత్యాల ప్రజలకు అందుబాటులో ఉన్న ఆర్ డి ఓ కార్యాలయం కూడా మరో చోటుకు తరలిస్తారట..కార్యాలయం ఎక్కడ ఉందో వేతుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది..జగిత్యాలలో నర్సింగ్ కళాశాల ను ఎమ్మెల్యేగా ఎల్ రమణ మంజూరు చేయించారు.నర్సింగ్ కళాశాల కోసం ఎల్ రమణ పార్టీ మారలేదు కదా.. అని నిలదీశారు.అభివృద్ధికి పార్టీ ఫిరాయింపు కు లెంకపెడితే ఎలా..అని ప్రశ్నించారు..ఎమ్మెల్యే సంజయ్ లాంటి స్వార్థపరులతో కాంగ్రెస్ ఖాతం అయింది..కేసీఆర్ లేకపోతే నూకపల్లి డబుల్ బెడ్రూం కాలనీ ఎక్కడిది..అవకాశవాదానికి కూడా పరిమితి ఉండాలి..నూకపల్లి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసినా కెసిఆర్ పేరు అర్బన్ హౌసింగ్ కాలనీకి పెట్టాలి..ప్రభుత్వ ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు ఎమ్మెల్యే ఎందుకు చొరవ చూపడంలేదు..కలెక్టర్ ఏవిధమైన టెండర్ , విధి విధానాలు, చట్టబద్ధత లేకుండా పెట్రోల్ బంక్ అప్పగించిన..ఎమ్మెల్యే ఎందుకు మాట్లాడటం లేదు..చాటుమటు వ్యవహారాలు బయట పడతాయని భయపడుతున్నారా..ఎమ్మెల్యే పోలీస్ అధికారుల బదిలీ లో చూపిన చొరవ, పోలీస్ సంక్షేమం కోసం ఏర్పాటు చేసే పెట్రోల్ పంపు పై ఎందుకు చూపడం లేదు...కలెక్టర్ చట్టానికి అతీతుడు కాదు..ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారు .ప్రభుత్వ ఆస్తులను రాష్ట్రంలో రేవంత్ రెడ్డి మాదిరిగా...జిల్లాలో కలెక్టర్ దారదతం చేస్తున్నారు..అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి మాత్రమే కాదు రాష్ట్రానికి మంత్రి...తహసీల్దార్ చొరస్తాలో రెవెన్యూ స్థలము లో కలెక్టర్ ఏకపక్షంగా టెండర్ పిలవకుండా ఐ ఓ సి కి అప్పగించడం పై మాట్లాడాలి...ఎమ్మెల్యే కు ప్రభుత్వ ఆస్తులు కాపాడాలనే చిత్తశుద్ధి ఉన్నటయితే మున్సిపల్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి.. లేనట్లయితే ఎమ్మెల్యే కూడా భాగస్వామి అని భావించాల్సి వస్తుంది.మున్సిపల్ ఆస్తి పెట్రోల్ బంక్ పై బీ ఆర్ ఎస్ తరపున న్యాయ పోరాటం చేస్తున్నాం.. రాష్ట్ర ప్రజావాణిలో సైతం వినతి పత్రం ఇచినం..కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవారీ శివకేసరి బాబు గాజుల రాజేందర్, రమేష్ రావు,దేవేందర్ నాయక్,తోట హరీష్, సింగరావు, వేణు,అభి,అనిల్,కాటిపల్లి రాజశేఖర్, గంగారెడ్డి, జున్ను రాజేందర్, ఆయిల్నేని వెంకటేశ్వర రావు, సామల రాజశేఖర్, మాజీ కౌన్సిలర్లు, కళ్లేపల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, సర్పంచులు పొట్టవతిని సతీష్ కుమార్, శీలం సురేందర్, స్వామి రెడ్డి, పల్లె రవి, బాలె రవి, మాజీ ఎంపీ పీ ధర రమేష్ బాబు,ఆనంద్ రావు, చందా రాధ కిషన్ రావు, శ్రీరాముల గంగాధర్, ముంజాల రఘువీర్ గౌడ్, సామల రాజశేఖర్, నక్క జీవన్, గుండా మధు గౌడ్, సన్నిత్ రావు, మామిడిపల్లి మహిపాల్, గంగారెడ్డి, మల్లేశ్వరి, పాల్గొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ ల

ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 53

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కె. వై. ప్రసాద్ లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి



ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా భవన్ (హైదరాబాద్) ముఖ్య మంత్రి ప్రజావాణి, జగిత్యాల జిల్లా ప్రజావాణికి సంబంధించి ఇప్పటి వరకు పెండింగ్లో ఉన్న దరఖాస్తులు వచ్చే ప్రజావాణి వరకు పరిష్కరించాలని లేని యెడల దరఖాస్తుదారులకు తగిన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.అనంతరం " నేత్రదానం శ్రేష్ఠ దానం" కార్యక్రమంలో భాగంగా 41వ నేత్రదాన పక్షోత్సవాలు ఆగష్టు 25 నుండి సెప్టెంబర్ 25 వరకు నిర్వహించబడునని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, జిల్లా పరిపాలన యంత్రాంగం తరఫున నేత్రదానాన్ని ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలని, మరణానంతరం మన నేత్రాలను దానం చేయడం ద్వారా చూపులేని ఇద్దరు వ్యక్తులు జీవితంలో వెలుగును నింపవచ్చని ఇది మనిషి చేయగల అత్యంత గొప్పదనం ఒకటి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కాలములో చేసిన సేవలు మరచిపోలేనివి... ఎమ్మెల్యే.

వీణవంక, ప్రభాత వార్త:

పదవి విరమణ పొందిన ఎ.రవిసూధకర్ ప్రజలకు అందుబాటులో ఉండి అందించిన సేవలు మరువలేనివ నీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.సోమవారం వీణవంక మండల కేంద్రంలో వీణ వంక ఎంపిడిఓ ఎ.రవి సుధాకర్ పదవి విరమణ సన్మాన సభ మాజీ జెడ్పీ వైస్ సి ఇ ఓ పవన్ కుమార్ అధ్యక్షతన జరిగింది.దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా రవి సుధాకర్ అందించిన సేవలను ఆయన కొనియాడారు.అంతేకాకుండా మండల ప్రజా ప్రతినిధులకు,ప్రజలకు అందుబాటులో ఉండి విధులను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు.పదవీవిరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో సంతోషంగా,ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షి ంచారు. ఎంపిడిఓ గా చేసిన కాలములో మండల అభివృద్ధికి చేసిన సేవలు సర్పంచులు ప్రశంసించారు.దీనికి ముందు ఎమ్మెల్యే తో పాటు సర్పంచులు, ఎంపిడిఓ లు, పంచాయితీ కార్యదర్శులు,మిత్రులు,బందులు ,సహోద్యోగులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ఫామ్‌హౌస్ వీడి ప్రజల్లోకి రావాలి



గోదావరిఖని, ప్రభాతవార్త:


మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుమారు వేయి రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, ఇప్పటికైనా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలపై పోరాడాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన బీఆర్ఎస్ అధినేతపై తీవ్ర విమర్శలు చేశారు.ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు కేసీఆర్ ఏ ప్రాంతానికైనా వెళ్లారా? వరదలు, ఇతర విపత్తులతో ప్రజలు అవస్థలు పడుతున్న సమయంలో వారి వద్దకు వెళ్లి పరామర్శించారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా అంటే జీతం, పదవి, ప్రభుత్వ వాహనాలు, ఇతర సౌకర్యాలు పొందడం మాత్రమే కాదని.. ప్రజల కష్టాల్లో వారి వెంట నిలబడి ప్రభుత్వంపై పోరాడటం కూడా బాధ్యతేనని పేర్కొన్నారు.వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నించే ముందు బీఆర్ఎస్ నాయకులు తమ అధినేతను ఫామ్‌హౌస్ నుంచి బయటకు తీసుకువచ్చి ప్రజల మధ్య నిలబెట్టాలని రాజ్‌ఠాకూర్ సూచించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో స్పందించకుండా ప్రతిపక్ష పాత్ర ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి జీతాల రూపంలో సుమారు రూ.1.24 కోట్లు పొందినట్లు రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు అందుతున్న జీతంతో పాటు ప్రభుత్వ సిబ్బంది, వాహనాలు తదితర సదుపాయాలను కూడా ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ఎర్రవల్లి ఫామ్‌హౌస్, హైదరాబాద్‌లోని నందినగర్ నివాసం తదితర ప్రాంతాల్లో వ్యక్తిగత కార్యదర్శులు, వ్యక్తిగత సహాయకులు సహా 57 మందికిపైగా సిబ్బందిని ప్రభుత్వం సమకూరుస్తోందని పేర్కొన్నారు. నాలుగు బుల్లెట్‌ప్రూఫ్ కార్లు, ఫాలోయింగ్ వాహనాలు, అంబులెన్స్, పికప్ వాహనాలు తదితర సదుపాయాలపై గత 32 నెలల్లో సుమారు రూ.21 కోట్ల వరకు ప్రజాధనం ఖర్చవుతున్నట్లు ఆరోపించారు.ప్రభుత్వ సదుపాయాలు పొందుతున్న నేతగా ప్రజా సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని రాజ్‌ఠాకూర్ అన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఇప్పటికైనా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి ప్రజల మధ్యకు రావాలని సూచించారు. ప్రతిపక్ష నేతగా ప్రజల తరఫున నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడాలని డిమాండ్ చేశారు.

పట్టణాభివృద్ధికి అందరి సహకారం కావాలి:ప్రభుత్వ విప్,

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లి పట్టణాభివృద్ధికి అందరి సహకారం కావాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ అన్నారు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో 50 లక్షల రూపాయల నిధులతో పెద్దపల్లి మండలం రాఘవాపూర్ వద్ద నూతనంగా నిర్మించబోయే కంపోస్టింగ్ షెడ్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలను పంపిణీ చేశారు. తదనంతరం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, పట్టణ కౌన్సిలర్లకు పెద్దపల్లి పట్టణ అభివృద్ధి పట్ల పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణానికి సంబంధించి రాఘవాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ వద్ద స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధుల ద్వారా 50 లక్షల రూపాయలతో డి.ఆర్.సి.సి, కంపోస్టింగ్ షెడ్ నిర్మాణం కోసం టెండర్లు పూర్తి చేసుకొని సోమవారం రోజున నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని, అలాగే రాబోయే ఆరు మాసాల్లో అట్టి నిర్మాణాన్ని ప్రారంభించుకునేలా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి పేదల సొంతింటి కల నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వ కాంగ్రెస్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని, ఆ పథకంలో భాగంగా పెద్దపల్లి పట్టణంలో రంగపల్లి, సుభాష్ నగర్‌లో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు





మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే అర్హులైన ఆర్వీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పట్టణంలో ఇప్పటివరకే చాలా అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని, పట్టణ ప్రజల సహకారంతో జెండా చౌరస్తా నుండి మసీద్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు పనులు చేయడం జరుగుతుందని, దసరా వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తామని, అభివృద్ధి కోసం ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఆర్వీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా చదవాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో పెద్దపల్లి జిల్లా అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ సాధించాలనే లక్ష్యంతో, యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడి చదవాలని పిలుపునిస్తూ కరీంనగర్‌లోని రేకుర్తి సమీపంలోని కిమ్స్ పి.జి. కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ తరగతులను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి, శిక్షణ విధానం, బోధన, వసతి, భోజనం తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రతి అభ్యర్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో నిరంతరం శ్రమించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం కల్పిస్తున్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణ



కాలంలో ప్రతి రోజును విలువైనదిగా భావించి, ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. చదువుతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని, పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా నిరంతరం సాధన చేయాలని తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదవాలని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతి అభ్యర్థి ఉద్యోగం సాధించేలా కృషి చేయాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. శిక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమర్థవంతంగా అందించాలని సంబంధిత అధికారులు, శిక్షణ నిర్వాహకులకు సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, బోధన తదితర అంశాల్లో నాణ్యతను పాటించాలని ఆదేశించారు. యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాలకు ఎంపిక కావడానికి అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని ప్రతి అభ్యర్థి సద్వినియోగం చేసుకొని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా అభ్యర్థుల కోసం కరీంనగర్‌లోని శౌర్య డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శిక్షణలో భాగంగా అభ్యర్థులకు ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయాలతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన శిక్షణ అందిస్తున్నారు. జూలై 27, 2026న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం మొత్తం 100 రోజుల పాటు కొనసాగనుంది. యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలకు అభ్యర్థులను సమర్థవంతంగా సన్నద్ధం చేయడమే శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం 100 మంది బాలికలు, 150 మంది బాలురు కలిపి మొత్తం 250 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎక్స్ సర్వీస్‌మెన్ ఎల్. మహిపాల్ రెడ్డి, శౌర్య డిఫెన్స్ అకాడమీ అధ్యాపకులు, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసేది పోలీసులే



పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

సొంత కుటుంబ బాగోగులకంటే సమాజ శ్రేయస్సే ముఖ్యం భావించి పోలీసులు నిరంతరం శ్రమిస్తారని, సుదీర్ఘకాలం సర్వీసు పూర్తి చేసుకుని రిటైర్ అవుతున్న అధికారులు ఇకపై తమ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో అనేక సంవత్సరాలుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. కమిషనరేట్ కార్యాలయ వేదికగా జరిగిన ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఎస్ ఐ ఎం.రవీందర్, ఏ ఎస్ ఐ లు బసవ దీపక్, దుంపల కొమురయ్య, హెడ్ కానిస్టేబుల్ చిలుముల మధునయ్యలను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వీస్ కాలంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా వీరు విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఇలాంటి అనుభవజ్ఞులైన అధికారులు రాబోయే తరానికి ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, క్రమం తప్పకుండా యోగా లేదా వ్యాయామాలు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవిస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఆరఐ రమేష్, సీసీ సందీప్, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి



ఎద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ బి శ్రీరాముల తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండలం కేంద్రానికి చెందిన రాజవ్వ తన ఇద్దరు కుమారులు తనను పోషించడం లేదని తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారిక రాస్తూ సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం దరఖాస్తు ఫార్వర్డ్ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెద్దపల్లి పట్టణానికి చెందిన బి రజిత తను ఒకేషనల్ ఏఎన్ఎం పూర్తి చేశానని తనకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టు ఔట్ సోర్సింగ్ ద్వారా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సొసైటీకి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జాంపేట గ్రామానికి చెందిన పుల్లూరు పద్మ తనకు వచ్చే ఒంటరి మహిళల పెన్షన్ నిలిపివేశారని తనకు ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డిఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తనకు చెందిన 46 గంటల భూమి పోతుందని, కానీ 47 గుంటలు పోతున్నట్లు రికార్డులలో తప్పుగా నమోదు చేశారని, దీనిని సవరించి తన గుంట భూమి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ సాగుకు స్వస్తి పలికి ఉద్యాన పంటలతో అధిక ఆదాయం సాధించాలి

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లాలో రైతులు తక్కువ ఆదాయం వచ్చే సాంప్రదాయ పంటలైన వరి సాగుకే పరిమితం కాకుండా, ఉద్యాన పంటలైన ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు తదితర వాణిజ్య పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వివిధ పథకాల ద్వారా పండ్లు, కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్ సాగుతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతులకు ప్రభుత్వం గణనీయమైన రాయితీలను అందిస్తోందని, ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిఢ్ పథకం కింద మామిడి, దానిమ్మ, నిమ్మ వంటి పండ్ల తోటల సాగుకు మొదటి సంవత్సరం ఎకరాకు 19,800 రూపాయలు, అరటి సాగుకు 16,800 రూపాయలు, బొప్పాయి సాగుకు 12,000 రూపాయలు, డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు 36,000 రూపాయలు చొప్పున సహాయం అందించడంతో పాటు రెండో సంవత్సరం నిర్వహణకు కూడా ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం నుంచి రాబోయే మే నెల వరకు వరుస పండుగలు, శుభకార్యాలు ఉండటంతో బంతి పూలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని, రైతులు పూల సాగు ద్వారా రోజువారీగా ఆదాయం పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మిఢ్ పథకం కింద బంతి, గులాబీ, మల్లె, చామంతి తదితర పూల సాగుకు ఎకరాకు 8,000 రూపాయల చొప్పున సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉల్లి సాగుకు ఎకరాకు 8,000 రూపాయలు, పసుపు సాగుకు 16,000 రూపాయలు, మల్చింగ్ షీట్ ఖర్చు కోసం 6,400 రూపాయల చొప్పున రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఆర్.కె.వి.వై పథకం కింద తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంలో ఎకరాకు 1,00,000 రూపాయల వరకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

బీరకాయ, సొరకాయ, కాకరకాయ, దోసకాయ తదితర తీగజాతి కూరగాయలను పందిళ్లపై సాగు చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడితో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఆర్.కె.వి.వై పి.డి.ఎం.సి పథకం కింద రైతుల వర్గీకరణను బట్టి డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలకు ఎస్.సి, ఎస్.టి రైతులకు 90 శాతం, బి.సి చిన్న, సన్నకారు రైతులకు 80 శాతం, ఇతర వర్గాల రైతులకు 70 శాతం వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే స్ప్రింక్లర్ ఇరిగేషన్‌కు 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు సూక్ష్మ సాగునీటి పద్ధతులను వినియోగించుకోవడం ద్వారా నీటిని ఆదా చేసుకోవడంతో పాటు పంటల దిగుబడిని పెంచుకోవచ్చని సూచించారు. ఎన్.ఎం.ఇ.ఓ ఓ.పి పథకం కింద ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు నాలుగు సంవత్సరాల పాటు కలిపి ఎకరాకు 49,000 రూపాయల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తోందని, ప్రస్తుతం ఆయిల్‌పామ్ ఎఫ్.ఎఫ్.బి ల ధర టన్నుకు 23,488 రూపాయలుగా ఉందని తెలిపారు.

ఐదో, ఆరో సంవత్సరం నుంచి దిగుబడి పెరిగి, ఎనిమిదో సంవత్సరం నుంచి 10 టన్నుల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉండటంతో దీర్ఘకాలికంగా ఎకరాకు 2 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చని వివరించారు. పెద్దపల్లి జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచడమే ఉద్యానశాఖ లక్ష్యమని, పథకాల వివరాలు, అర్హతలు, సబ్సిడీలపై మరింత సమాచారం కోసం రైతులు తమ సమీపంలోని ఉద్యానశాఖ అధికారులను లేదా ఐ.డి.ఓ.సి, పెద్దపల్లిలోని జిల్లా ఉద్యానశాఖ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని తెలిపారు.

పారదర్శకంగా 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, నిషేధిత భూములకు సంబంధించిన వ్యవహారాల్లో పూర్తి ఆధారాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని, తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పని చేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా వడ్లకొండ నవీన్

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:





రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా వడ్లకొండ నవీన్ ఎన్నికైనట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నాడు పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డి.సి.పి కె.శ్రీనివాస్, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డి.సి.పి శ్రీనివాస్, ఎ.సి.పిలు నాగేంద్ర గౌడ్, రమేష్, ఎ.ఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఎస్.ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వడ్లకొండ నవీన్, ఎ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌పై 5 ఓట్ల ఆధిక్యంతో రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంగా అధ్యక్షుడిగా వి. నవీన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ 291, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్, ఉపాధ్యక్షులుగా ఎన్. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ విభాగం; ఎం. తిరుపతి, ఎ.ఎస్.ఐ, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, ప్రధాన కార్యదర్శిగా జె. అంజనేయులు, సబ్‌ఇన్‌స్పెక్టర్, సి.సి.బి రామగుండం, సంయుక్త కార్యదర్శిగా కె. ఓంకార్, కానిస్టేబుల్, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్, సంస్థాగత కార్యదర్శిగా డి. వినోద్ బాబు, కానిస్టేబుల్, ఎన్.టి.పి.సి పోలీస్ స్టేషన్, కోశాధికారిగా టి. సుందర్ సింగ్, కానిస్టేబుల్, ధర్మారం పోలీస్ స్టేషన్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.డి. రిజ్వాన్ షా ఖాన్, హెడ్ కానిస్టేబుల్ 714, సి.ఎస్.బి రామగుండం; డి. అనిల్ కుమార్, కానిస్టేబుల్, సంత్‌నగర్ పోలీస్ స్టేషన్; సి.హెచ్. దేవరాజ్, కానిస్టేబుల్, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్, కార్యవర్గ సభ్యులుగా ఎం. రాజిత, మహిళా పోలీస్ కానిస్టేబుల్, పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్; ఎ. కపిల్, ఎ.ఆర్ పోలీస్ కానిస్టేబుల్, సి.ఏ.ఆర్ రామగుండం; డి. రాజు, ఎ.ఆర్.ఎస్.ఐ, సి.ఏ.ఆర్ బెల్లంపల్లి ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను సి.పి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలను అందజేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం విజయం సాధించిన అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారికంగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సి.పి మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని సి.పి ఆకాంక్షించారు. సంఘం బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేస్తూ పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించిన ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలు నేరుగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేదా పైరవీలకు తావులేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుతో పోలీస్ కమిషనర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్.ఐలు, సి.ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు పారదర్శకమైన పోలీసు సేవలను అందించడమే రామగుండం పోలీస్ కమిషనరేట్ లక్ష్యమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డుల పంపిణీ

ఓదెల,ప్రభాతవార్త:

ఓదెల పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం రేషన్ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు సర్పంచ్ కనకిరెడ్డి సతీష్, ఉప సర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్ గ్రామ కార్యదర్శి, జిపిఓతోపాటు పాలకవర్గ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, ఉపసర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి వెంకట లక్ష్మణ్, గ్రామ జిపిఓ కిషన్, వార్డు సభ్యులు గొర్ల శ్రీనివాస్, అప్పని తిరుపతి, కొండ్ర లక్ష్మణ్, రాపెల్లి రాజయ్య, చింతం తిరుపతి, బుద్దే రవి, సిరిగిరి రాజారాం, బోడకుంట రామచంద్రం, కొండ్ర ఓదెలు ఇతర వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మడక లో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి

ఓదెల,ప్రభాతవార్త:

మండలంలోని మడక గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎడ్ల ప్రమీల కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. మృతురాలి కుమారులు వెంకటరెడ్డి, ఎడ్ల కేశవరెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని, వారి దుఃఖంలో పాలుపంచుకుంటున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నోముల పద్మావతి ఇంద్రారెడ్డి, నాయకులు గొర్ల కుమార్, గోశిక లింగమూర్తి, ఆవుల రవీందర్, ఐలయ్య, గోషిక స్వామి, వన్నారెడ్డి, సొదరి రమేష్, గిద్దెమారి రమేష్, బోయ సదానందం, బినవేణి పరశురాములు, గడ్డం శ్యామ్, పాకాల సత్యనారాయణ రెడ్డి, భీమారి సృజన్, డాక్టర్ శంకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

10వ వార్డులో రూ.50 లక్షలతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శ్రీకారం

ష్మమంథని ప్రభాతవార్త:

మంథని మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా డి ఎం ఎఫ్ టి నిధులు రూ.50 లక్షల వ్యయంతో నూతన రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మున్సిపాలిటీ పాలకవర్గం సోమవారం శ్రీకారం చుట్టారు. చిల్డ్రన్స్ పార్క్ నుంచి గొడుగు బంగ్లా వరకు మిగిలిన రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ పెంటరి రాజు తో కలిసి పర్యవేక్షించారు. ఈ



సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, మంథని మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి మెరుగైన రవాణా, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నూతన రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తయితే 10వ వార్డు ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు తగ్గి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లెంకి వంశీధర్ , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ పేరుతో యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

రామగిరి ప్రభాతవా ర్త

రాజీవ్ యువ వికాస్ పేరుతో యువతను మోసం చేసి ఓట్లు దండుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బిజెపి కమాన్పూర్ మండల శాఖ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత సంవత్సరం 15.3. 2025 న ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం యువకులకు సబ్సిడీ కింద ఇస్తానన్న రుణలు



ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా ఎంత సమయం కావాలని ఆయన ప్రశ్నించారు.రాష్ట్రం లో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ యువత కు సబ్సిడీ లోన్ లు ఇస్తామని చెప్పి ఇవ్వక పొగ సంవత్సరం గడిచిపోయి లబ్ధిదారులను ఎంపిక చేయక వారికి ఋణ డబ్బులు అందించలేదని అన్నారు. యువకులకు రుణాలు ఇస్తానని ఆశ చూపి వారి చేత అప్లికేషన్ల పేర్ల మీద వారితో ఖర్చులు పెట్టించి వాటిని ఎంపీడీవో ఆఫీసులో అటక మీద పడేశారని ఆయన ఎద్దేవా చేశారు . వెంటనే ప్రభుత్వం యువతకు రుణాలు ఇచ్చి వారికీ ఉపాధి కల్పించాలని లేని యెడల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో యువతతో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం

మంథని ప్రభాతవార్త : ,

రైతులకు పంపిణీ మరింత పారదర్శకంగా సులభతరం చేయడానికి కేంద్ర వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చిన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా జిల్లాలోని రైతులు తమకు అవసరమైన అన్ని రకాల ఎరువులను బుక్ చేసుకోవచ్చునని మంథని వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ నవ్య తెలిపారు. యాప్ ద్వారా బుక్ చేసుకున్న ఎరువులను 48 గంటల గడువులో పొందే విధంగా ఈ వ్యవస్థను అమలు చేస్తుందన్నారు ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా అన్ని కేటగిరీల రైతులు ఎరువులను బుక్ చేసుకుని సకాలంలో పొంద వచ్చున్నారు . ఇందులో పట్టాదారు రైతులు, మరణించిన పట్టాదారు రైతుల వారసత్వం నమోదు కాని భూములను సాగు చేస్తున్న రైతులు, కౌలుదారులు, అటవీ భూములు, పోడు భూములు, ,దేవాదాయ శాఖ భూములు సాగు చేస్తున్న రైతులు కూడా ఉంటారని పేర్కొన్నారు. రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునేపుడు ఆధార్ ఫోన్ నెంబర్ వెరిఫికేషన్ అయిపోయిన తర్వాత భూమి వివరాలు నమోదు చేసేటపుడు నేను యాజమానిని అ . రెవిన్యూ రికార్డు లో భూమి వున్నా రైతులు నేను చట్ట పరమైన వారసుడుని యి. నేను యాజమానిని కానీ నా భూమి వివరాలు రెవిన్యూ రికార్డు లో అప్డేట్ కాలేద అని పేర్కొనాలన్నారు.నేను యజమానిని కాదు నాకు అటవీ హక్కుల పట్టా వుంది దేవాదాయ శాఖ భూములు ప్రభుత్వ భూమి సంస్థ కె వి కె కమ్యూనిటీ భూమి కౌలు రైతులు పైన పేర్కొన్న కేటగిరీ లకు చెందిన రైతులు సర్వే నెంబర్ మన్యూఅల్ గా నమోదు చేసుకోవాలన్నారు. ల్యాండ్ అనే ఆప్షన్ ఎంపిక చేసుకొని సాగుచేస్తున్న భూమి సర్వే నెంబర్, విస్తీర్ణం నమోదు చేస్తే సంబంధిత వ్యవసాయా అధికారి అప్రూవల్ కి వెళ్తుందన్నారు . వ్యవసాయా అధికారి అమోదించిన తర్వాత రైతులు ఎరువులను బుక్ చేసుకువని పొంద వచ్చు



అన్నారు. రైతులకు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారన్నారు . అంతేకాకుండా జిల్లాలో ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని రైతులు ఎరువుల లభ్యతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకుని సకాలంలో పొందాలని ఆమె కోరారు.

కుల వివక్ష చూపితే చర్యలు తప్పవు

రామగిరి ప్రభాతవార్త

గ్రామాలలో కుల వివక్ష చూపితే చర్యలు తప్పవని డిప్యూటీ తహసిల్దార్ యజ్ఞం పట్ల మానస, ఏఎస్ఐ స్వామి అన్నారు. సోమవారం రామగిరి మండలంలోని పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలో గల వకీల్ పల్లె ప్లాట్లలో తాసిల్దార్ పర్ణంది సుమన్ ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్లాసుల విధానానికి స్వస్తి పలకాలని, ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ తారతమ్య బేదం లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని ఎవరైనా కుల వివక్ష చూపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిందం మహేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కె, మహేష్,



పంచాయతీ కార్యదర్శి ప్రేమలత,అంబేద్కర్ సంఘం నాయకులు బూడిద సమ్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్, ప్రవీణ్ నాయక్, జి పి ఓ లు వెంకటేశ్వర్లు, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజావాణి

జూలపల్లి,ప్రభాతవార్త:

మండల ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజల తమ సమస్యలను ఎంపీడీవో పద్మజ దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన మొత్తం ఆరు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.దరఖాస్తుదారులు తమ సమస్యలను అధికారులకు వివరించి,వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి సంపత్ రెడ్డి, వ్యవసాయ అధికారిణి ప్రత్యూష,మండల పశువైద్య అధికారి అభిలాష్ రెడ్డి,పోలీస్ సిబ్బంది ఎస్సై బి. మల్లేష్, ఏ ఎస్ఐ ఎండి.సులేమాన్, కానిస్టేబుల్ రాజేందర్,ఎంఈఓ ఎస్. లక్ష్మణ,ఎంపీఓ శేషయ్య సూరి,విద్యుత్ శాఖ ఏఈ హరీష్,ఆర్టికల్చర్ ఆఫీసర్ మహేష్,ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట లక్ష్మి,హౌసింగ్ ఏఈ సాహితి,తాసిల్దార్ సిబ్బంది శ్రీలత పాల్గొన్నారు.

క్రీడలు శారీరక మానసిక ఎదుగుదలకు తోడ్పడుతాయి



రామగిరి ప్రభాతవార్త

క్రీడలు శారీరక మానసిక ఎదుగుదలకు తోడ్పడుతాయని మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ అన్నారు. జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం జెఎన్టియు ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. షటిల్ బ్యాడ్మింటన్ ,చెస్ , క్యారమ్స్ పోటీలు బాల బాలికలకు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొని బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతినిత్యం ప్రాక్టీస్ చేయాలని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిల్ కృష్ణారెడ్డి, జి సునీల్ కుమార్, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి ఘన సన్మానం



రామగిరి ప్రభాతవార్త

రామగుండం ఆర్ జి త్రీ ఓసీపి1 బేస్ వర్క్ షాప్ మెయింటెనెన్స్ సెక్షన్ లో జనరల్ మజ్దూర్ గా 38 సంవత్సరాల ఐదు నెలల సర్వీస్ పూర్తి చేసి పదవీ విరమణ పొందుతున్న బొగధం మీడి రవీందర్ అరుణ దంపతులకు సోమవారం సుందరం పౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని శాలువా, పూలమాలలు భోకేతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి పటేల్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం వారి శేషాజీవితం ఆయురారో గ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ చిప్పకుర్తి అరవింద్ సభ్యులు కుక్క హరి ప్రసాద్, క్యాధాసి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5లక్షల ఎల్ ఓ సి మంజూరు

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండల కేంద్రానికి చెందిన జక్కుల ఎంకన్న అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం గత కొద్ది రోజుల క్రితం మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా సి ఎం ఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మంత్రి శ్రీధర్‌బాబు సి ఎం ఆర్ ఎఫ్ కింద రూ.2.5లక్షల ఎల్ ఓ సిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. మంత్రి ఆసుపత్రి సహాయకుడు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రమేష్ కుటుంబ సభ్యులకు ఈ ఎల్ ఓ సిని సోమవారం అందజేశారు. ఎల్ ఓ సిని మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా రమేష్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణికి 10 దరఖాస్తులు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



గంభీరావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 10 దరఖాస్తులు వచ్చినట్లు నోడల్ అధికారి రాజేందర్ తెలిపారు. బాధితుల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో తహసిల్దార్ మారుతిరెడ్డి లతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం

డిసిసి అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



ప్రజా సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వం లక్షమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు . సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిపక్ష బి ఆర్ ఎస్ పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీ పాలనపై ఆరోపణలు చేస్తూ, వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లోకి వెళ్తామంటూ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా పక్షాన తీవ్రంగా తప్పు పడుతుందన్నారు.బిఆర్ఎస్ పార్టీకి ప్రజల్లోకి వెళ్లే నైతికత కోల్పోవడంతోనే ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకున్నారని తెలిపారు . రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన పగ్గాలు చేపట్టిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సీట్లు గల్లంతయ్యాయి అన్నారు. ఉప ఎన్నికల్లో , మున్సిపల్ ఎన్నికల్లో , గ్రామ పంచాయతీ ఎన్నికల్లో , ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదంటే బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ లో పనికి రాదని, కుటుంబం పార్టీకి ప్రజల్లో చోటులేదని అన్నారు . మహిళలకు 500 కే సిలిండర్, ఉచిత బస్సు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అమలు చేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రియాజ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఆకునూరు బాలరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడేపు చంద్రకళ, కౌన్సిలర్లు గంగరాజు, శ్రీశైలం, లీల, జిల్లా నాయకులు చొక్కల రాము, వేముల దామోదర్, బొప్ప దేవయ్య, నీలి రవీందర్, తుంగ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



రాష్ట్రంలో చేపట్టిన రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన రోడ్లు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, డబ్లింగ్ పనుల పురోగతి, స్టేషన్ల ఆధునీకరణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. రైల్వే లైన్ల విస్తరణకు ఎక్కడా ఆటంకాలు కలగకుండా భూసేకరణను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. ప్రతి పనికీ కాలపరిమితి నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగించాలి

అంకం భూమయ్య



గొల్లపల్లి, ప్రభాతవార్త: చేయూత పెన్షన్ల దరఖాస్తు గడువు 31వ తేదీతో ముగియడంతో, దరఖాస్తు గడువును వెంటనే పొడిగించాలని చేనేత ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల చివర్లో వరుసగా సెలవులు రావడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా చేయూత పింఛన్ల దరఖాస్తు గడువును పెంచాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు పైబడిన అర్హులైన చేనేత కార్మికులందరికీ చేయూత పథకం ద్వారా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ

25 అంశాలతో సాధారణ సమావేశం తీర్మానం

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 25 అభివృద్ధి అంశాలను కౌన్సిల్ తీర్మానం ఆమోదం తెలపడం జరిగిందన్నారు. రాబోయే బతుకమ్మ దసరా పండుగల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ , విలీన గ్రామాలతో పాటు వివిధ ఏరియాలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల కొరకు లైటింగ్ , గ్రావెల్, జేసిబి మరియు బ్లేడ్ ట్రాక్టర్లు మొదలగు ఏర్పాట్ల కొరకు గాను రూ.29.00 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా , వైస్‌చైర్మెన్ దార్ల సందీప్, వార్డు సభ్యులు , కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతులకు సాయం చేయాలి

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల సొసైటీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో 100 కుటుంబాలకు పైగా రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతులకు సాయం చేయాలి అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కు తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల (ఇందిరానగర్)గ్రామ రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు.సుమారు 260 ఎకరాల ప్రభుత్వ భూమిలో కూరగాయలు, పత్తి,వరి తదితర పంటలను కాలానుగుణంగా సాగు చేస్తున్నామని వెల్లడించారు.పలు సర్వే నంబర్లలో భూములు 1036, 1042, 1061, 1066, 1067, 1071, 1072, 1078, 1079, 1082, 1083, 1085, 1092, 1093, 1096 తదితర సర్వే నంబర్లలో భూములు ఉన్నట్లు తెలిపారు.పంటల సాగుకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం అందించాలని,ప్రభుత్వమే పంట కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని జిల్లా అధ్యక్షుడికి రైతులు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతుల పరిస్థితిని పరిశీలించి,వారి జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పెద్దలకు సమస్యను తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ రైతులతో పేర్కొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ధర్మపురి,ప్రభాతవార్త.



ఇండ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ కౌన్సిలర్ సంగి ఆనంద్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ పట్టణం,10వ వార్డు పరిధిలో గల కాళ్ల లింగమ్మ మల్లేష్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు పూర్తి కాగా,సోమవారం గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.సదరు వార్డ్ కౌన్సిలర్ సంగి ఆనంద్ లబ్ధిదారులైన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు మంత్రి లక్ష్మణ్ కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమురయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

పెగడపల్లి, ప్రభాతవార్త :



కీసలాటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి రాములు అకాల మరణం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన స్వగృహానికి సోమవారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కడారి తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, రాజారాంపల్లి సర్పంచ్ రమేష్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెట్ల కిషన్, మహేష్, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి రవి, ఉపసర్పంచ్ మహేందర్, మాజీ ఉపసర్పంచ్ కుమార్, పెద్ది శ్రీను, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి మండలంలో ప్రజావాణి కార్యక్రమం

ప్రభాత వార్త ఎండపల్లి ఆగస్టు 31



ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీవో డి కృపాక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 12 అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను వెంటనే పరిశీలించి పెండింగ్లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

గొల్లపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

గొల్లపల్లి, ప్రభాతవార్త:



పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి పరిరక్షణ, సామాజిక సమానత్వం, వివక్ష నిర్మూలన వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులు, బాధ్యతలను కూడా తెలుసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, ఉపసర్పంచ్ గురజాల బుచ్చిరెడ్డి, రెవెన్యూ పరిశీలకులు జీవన్, జీపీఓ జవహర్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

ఎన్నికలకు ముందు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చిందని వెంటనే హామీలు అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం రోజున సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామాలను, ప్రభుత్వ పాఠశాలలను, ఆసుపత్రులను సందర్శించడం జరిగిందన్నారు. ప్రభుత్వ బడుల్లో అనేక సమస్యలు ఉన్నాయనీ, ముఖ్యంగా విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరన్నారు. అనేక ప్రభుత్వ బడుల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందనీ, స్వీపర్స్, అటెండర్స్ లేరన్నారు. క్లాస్ రూమ్స్ శిథిలావస్థ లో ఉన్నాయనీ. కొన్ని స్కూళ్లలో పెద్ద చెట్లు ఉండడం మూలంగా ఈదురు గాలులకు విరిగిపడితే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు బడుల్లో ఇష్టారితిన ఫీజులు వసూలు చేస్తున్నారనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. పేషెంట్లకు కావలసిన మందులు లేవని,సమయానికి డాక్టర్లు, సిబ్బంది రావడం లేదన్నారు.ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడి విపరీతంగా పెరిగిపోయింది అన్నారు. అర్హులైన పేదలకురేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.అనేక గ్రామాల్లో చేతి బోర్ పంపులు పనిచేయడం లేదని వెంటనే మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో



ఉంచాలన్నారు. పెండింగ్లో ఉన్న సాదా బైనామాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతు చేయాలన్నారు. రైతాంగానికి నాణ్యమైన ఉచిత విద్యుత్తును 24 గంటల పాటు సరఫరా చేయాలన్నారు. కరెంటు కోతలను నివారించాలన్నారు ప్రభుత్వ స్కూల్స్ ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ ఆసుపత్రుల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న డబుల్ బెడ్ రూమ్ ల ఇండ్లు అరులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి, అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు అందించాలన్నారు. పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి సీటు ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరలు నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్, మండల కమిటీ సభ్యులు రావుల ఓదెలు, చేరాలు, రమేష్, సాయిరాం, నాగరాజు, సురేష్, హరీష్, సమ్మయ్య, ఖలీల్ పాషా, ఉడుత నాగరాజుతదితరులు పాల్గొన్నారు.

పది సెకన్లలో మాయమైపోతున్న యూరియా

ముస్తాబాద్ ప్రభాత వార్త:



మండల బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యములో యూరియా కొరత,బుకింగ్ అంశాలపై సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపిడిఓ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు శీలం స్వామి మాట్లాడుతూ మండలములో రైతులు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్య యూరియా కోసం రైతులు బుక్ చేస్తే 10 సెకన్ల లో వందల బస్తాలు మయమవుతుందని అన్నారు.ఇంకా రెండో దశకు అందాల్సి న యూరియా అందలేదని అన్నారు.మండల కేంద్రములో వున్న 18 ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు సరిపడే యూరియా స్టాక్ నిల్వ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

పీఏసీఎస్‌లకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి : కలెక్టర్‌కు వినతి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాలను నామినేషన్ పద్ధతిలో కాకుండా వెంటనే ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలని కోరుతూ పలువురు చైర్మన్లు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలో 908 పీఏసీఎస్‌ల పదవీకాలం ముగిసి ఏడాది దాటినా ఎన్నికలు జరపకుండా ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతికి సిద్ధమవడం సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని వారు పేర్కొన్నారు. వైద్యనాథన్ కమిషన్ సిఫార్సులు, సహకార చట్టం ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా తక్షణమే ఎన్నికలు నిర్వహించేలా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో చైర్మన్లు ఆలేటి చిన్నారెడ్డి, అనుగు తిరుపతిరెడ్డి, బి. దేవదాస్, మాజీ చైర్మన్ టి. కిషన్ రెడ్డి ఉన్నారు.

బకాయిలను విడుదల చేయాలని ఏబివిపి వినతి

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:



రాష్ట్రంలోని విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబివిపి నాయకులు సోమవారం తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి సాయి చరణ్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేసి, కళాశాలలకు బకాయిలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, కుమారస్వామి, కృష్ణ, మణిప్రీతం, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వర్గాన్ని ఆదుకుంటుందని దాంట్లో భాగంగా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలో మైనారిటీలకు 250 కుట్టు మిషన్లను ఉచితంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారి మైనారిటీలకు ఈ పథకాన్ని అందజేస్తున్నామని, రానున్న రోజుల్లో మరికొన్ని సంక్షేమ పథకాలు మైనారిటీలకు అందిస్తామని, ఈ పథకానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అజారుద్దీన్, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్ కు హుజురాబాద్ నియోజవర్గ మైనారిటీల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్డీఓ జల కుమారి, ఎమ్మార్వో నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:



ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం తహశీల్దార్ నరేందర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని,ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశీ సిస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని, మేకిన్ ఇండియా, స్టార్ట్ ఆఫ్ ఇండియా, డిజిటల్ ఇండియా తెలిపారని అన్నారు. కానీ అవన్నీ కార్పొరేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు ఉపయోగపడుతున్నాయి తప్పితే, దేశంలోని ప్రజానీకానికి యువతకు ఎలాంటి లాభం చేకూర్చలేదని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీతో అధికారం లోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న, ఆరు గ్యారంటీల అమలుకు నోచుకోలేదని, కేవలం ఉచిత బస్సు మహిళలకు, సన్న బియ్యం, హామీలు తప్పా, మిగతావి అమలు కావడం లేదని అన్నారు. రాష్ట్రంలో అనేక ఖాళీలు ఉన్నప్పటికీ ఉద్యోగాలు భర్తీ చేయక నిరుద్యోగుల పొట్ట కొడుతున్నారని అన్నారు. రెండు ప్రభుత్వాలపై కార్మికులు ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కొంకట చంద్రయ్య, ప్రతాప శ్రీనివాస్, రాచపల్లి లింగయ్య, ఇమ్మడి దేవయ్య, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొండ పోచమ్మ ఆలయం కు సీ సీ కెమెరా వితరణ

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయినపల్లి మండలం కోరేం గ్రామానికి చెందిన రోమాల నరేష్ అశ్విని దంపతులు స్థానిక కొండ పోచమ్మ ఆలయం కు సీసీ కెమెరా వితరణ చేశారు. ఆదివారం ప్రదాన ఆలయం ముందు సీసీ కెమెరా బిగించారు. ఈ దంపతులు మొక్కు కింద సీసీ కెమెరా అందించారు. వీరికి అక్షయ్ రామ్, కూతురు వినయ్ కుమారుడు విరాజ్ ఉన్నారు. సి సి కెమెరా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వన్నెల రమణారెడ్డి, ఫ్యాక్స్ డైరెక్టర్ మల్లారెడ్డి, నాయకులు పులి హను మండ్ల, నేరెళ్ల ఆంజనేయులు, జుట్టు తిరుపతి, నర్సింగోజు రాము, నర్సింగోజు నరేష్ ఉన్నారు.

జమ్మికుంట బస్టాండ్ ముందు ఆర్టీసీ బస్సు బీభత్సం

బిక్షాటన చేసుకుంటున్న వృద్ధుడిని ఢీకొట్టిన బస్సు

జమ్మికుంట ప్రభాత వార్త:



జమ్మికుంట పట్టణంలోని బస్టాండ్ ముందు రోడ్డు ప్రమాదం జరిగింది.జమ్మికుంట పట్టణంలో బిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు నిరక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాదాన్ని చూసిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా వృద్ధుడిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బస్టాండ్ ముందు ఆర్టీసీ బస్సులు నిరక్ష్యంగా నడుపుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ఆరు తడి పంటలను సాగు చేయాలి

హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత

సైదాపూర్, ప్రభాత వార్త:

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల కంది, పెసర, మినుము, అలసందలు, ఆముదం వంటి ఆరుతడి పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని రైతులకు సూచించారు. సోమవారం సైదాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో రికగ్నిషన్ ప్రియర్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ... రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎరువుల సరఫరా బుకింగ్‌కు సంబంధించిన ప్రభుత్వ వ్యవస్థ ఫార్మర్ రిజిస్ట్రీతో అనుసంధానం అయ్యిందని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ప్రయోజనకరమని తెలిపారు. ప్రభుత్వం సూచించిన సన్న రకాల వరి ధాన్యాన్ని సాగు చేస్తున్న రైతులు సంబంధిత డీలర్ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఇంటి వద్ద ఉన్న విత్తనాలు లేదా ఇతర రైతుల వద్ద నుంచి బిల్లులు లేకుండా తీసుకున్న విత్తనాలను ఉపయోగించిన రైతులు



సంబంధిత ఏఈఓకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, వాతావరణ మార్పులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కూరగాయల సాగుతో పాటు కోళ్లు, గొర్రెల పెంపకం, ముసగ సాగు వంటి అనుబంధ కార్యకలాపాల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని రైతులకు వివరించారు.హార్టికల్చర్ శాఖ ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ ఆయిల్ ఫామ్ సాగు విధానం, ఎకరాకు మొక్కల సంఖ్య, ఆయిల్ ఫామ్‌లో అంతర పంటల సాగు, కాపు ప్రారంభమయ్యే సమయం, రైతులకు లభించే ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, పంట ద్వారా పొందగల ఆదాయం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. వైదేహి, ఏఈఓలు సుష్మ, వంశీ, రాజు, రజినీకాంత్, రాజేంద్రప్రసాద్, ప్రేమ్ సాగర్, హార్టికల్చర్ ఆయిల్ ఫెడ్ ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, మండల రైతులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన విఫలం

రుద్రంగి మండల బీఎస్పీ నాయకులు

రుద్రంగి ప్రభాత వార్త :

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని రుద్రంగి మండల బీఎస్పీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భముగా వారు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, పెన్షన్లు రూ. 2 వేల నుండి రూ. 4 వేలు పెంచుతామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని, రూ. 500 కె గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులను, ఇలా అన్ని వర్గాల ప్రజలను ప్రజా ప్రభుత్వం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు అలాగే బీడీ కార్మికులకు సైతం పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే యూరియా కొరత వలన రైతులు ఇబ్బందులకు గురవుతుంటే కొత్తగా యూరియా ఆప్ వలన మరింత ఇబ్బంది



పడుతున్నారని విమర్శించారు. వెంటనే యూరియా ఆప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైనందున సంబరాలు జరుపుకునే అర్హత వారికి లేదని, ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్, ఉపాధ్యక్షుడు, ఏనుగందుల సతీష్, గ్రామశాఖ అధ్యక్షుడు నల్ల నవదీప్, ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్ నాయకులు మల్యాల మహేష్, కట్కూరి హనుక్, దయ్యాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి పరిష్కారానికి కాదు.. మొబైల్‌లకే రిమితమైన అధికారులు

ప్రభాతవార్త కోనరావుపేట

కోనరావుపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం తూతూ మంత్రంగా సాగిందని మండల ప్రజలు ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన లబ్ధిదారులను పట్టించుకోకుండా కొందరు అధికారులు మొబైల్ ఫోన్లలో లీనమై కనిపించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు ఈ కార్యక్రమంపై తగిన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజల సమస్యలను ఆలకించి పరిష్కార మార్గం చూపాల్సిన అధికారులు సెల్‌ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన6 దరఖాస్తులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించిన 1 దరఖాస్తు వచ్చినట్లు సమాచారం. ప్రజావాణి ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా, మొబైల్ ఫోన్లలో లీనమవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా అధికారులు ప్రజా సమస్యల



పరిష్కారంపై దృష్టి సారించాలని, ప్రజావాణి కార్యక్రమాన్ని నిరక్ష్యం చేస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ తనిఖీ

వేములవాడ ప్రభాత వార్త:



గుడి చెరువు సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు.ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్.. ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

తిప్పర్తి నరసింహ చారికి ఘన సన్మానం

బోయిన్ పల్లి ప్రభాత వార్త



పదవీ విరమణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభా కార్యక్రమంలో హిందు వాహిని జిల్లా అధ్యక్షులు బెజ్జంకి శ్రీకాంత్ తిప్పర్తి నరసింహ చారిని శాలువాతో సన్మానించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ నరసింహ చారి తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో నిబద్ధత క్రమశిక్షణ సేవా భావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో ఆనందమయమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి పద్మ కుమారులు తిప్పర్తి సందీప్ అభిషేక్ కుమార్తె అశ్విని కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్

బోయిన్ పల్లి ప్రభాత వార్త



ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నిరంతరం ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిశుభ్రంగా గ్రామాన్ని ఉంచేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పనిచేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు దోమల ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలలో నీరు విలువ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధం పై ప్రజలు అవగాహనతో వ్యవహరిస్తే దోమల వ్యాప్తిని మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని సర్పంచ్ పెంచల సౌమ్య మహేష్ తెలిపారు.

జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

వేములవాడ ప్రభాత వార్త:



వేములవాడ పర్యటనకు విచ్చేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె మర్యాదపూర్వకంగా కలిశారు. వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ మైత్రి గెస్ట్‌హౌస్‌లో చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.మంగళవారం ఉదయం భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై సమీక్ష నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

చెరువుల అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

వేములవాడ ప్రభాత వార్త:



వేములవాడ నియోజకవర్గంలోని చెరువుల అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెరువుల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.నియోజకవర్గంలోని 394 చెరువులను పరిశీలించి దెబ్బతిన్న మత్తడులు, బండ్లు, తూములకు ప్రాధాన్యతనిస్తూ వర్షాకాలంలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ ఎం. రమేష్, ఈఈ ప్రశాంత్, డీఈ దయాకర్, ఏఈలు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల అరెస్టు

చందుర్తి : ప్రభాతవార్త



హలో మాల.. చలో సెక్రటేరియట్ అనే కార్యక్రమానికి సోమవారం హైదరాబాద్ తరలి వెళ్లిన మాల మహానాడు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు బత్తుల కమలాకర్ ఆధ్వర్యంలో మండల నాయకులు చలో సెక్రటేరియట్ కు తరలి వెళ్ళగా హైదరాబాదులో అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బత్తుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ మాలలకు రావలసిన హక్కులను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.